

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 21-07-2026 | సంపుటి - 29 | సంచిక - 59 | రూ : 4 | పేజీలు: 8


## వచ్చే ఏడాది నాటికి

# 'క్యూర్'లో ఇందిరమ్మ ఇళ్లు

### ఇక్కడ గజం విలువ గరిష్ఠంగా రూ.3 లక్షలు

- పేదలకు ఖరీదైన ప్రాంతాల్లో ఇళ్లు ఇస్తామంటే కొందరు హేళన చేశారు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- క్యూర్‌లో ఇళ్ల నిర్మాణ పథకం లాంఛనంగా ప్రారంభం
- పాల్గొన్న మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం, అజారుద్దీన్



**హైదరాబాద్, 20 జూలై :** ''కాంగ్రెస్ ప్రభుత్వం జీహెచ్ఎంసీ కోర్ ప్రాంతంలో ఇళ్లు నిర్మించి ఇస్తామంటే కొందరు హేళన చేశారు. ఈ పథకం అమలు కాకుంటే విమర్శలు చేయవచ్చని సంతోషపడ్డారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా మేం క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం చుట్టాం. ఏడాది వ్యవధిలోనే లబ్ధిదారులకు అందజేస్తాం'' అని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఈ ప్రాంతాల్లో స్థలాల ధర గజం రూ.2 లక్షల నుంచి రూ.3లక్షలు, ఎకరాకు రూ.250 కోట్ల వరకు పలుకుతోందన్నారు. తొలి విడతలో పైలట్ ప్రాజెక్టు కింద 16 నియోజకవర్గాల్లో గుర్తించిన స్థలాల్లో 7,680 ఇళ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. సచివాలయంలో సోమవారం 'క్యూర్' పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్ల పథకానికి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులు డి.శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, మైనార్టీ శాఖ మంత్రి అజారుద్దీన్, గ్రేటర్ పరిధిలోని ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలతో కలిసి పొంగులేటి శ్రీనివాసరెడ్డి... జ్యోతి వెలిగించి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఇళ్ల వాట్సప్ అప్లికేషన్, మార్గదర్శకాలతో కూడిన బ్రోచర్‌ను విడుదల చేశారు. పథకంపై పవర్‌పాయింట్ తరువాయి 2లో




## కరవును ఎదుర్కోవడంలో

# కాంగ్రెస్ సర్కారు విఫలం

- భారాసలో చేరికల కార్యక్రమంలో కేటీఆర్

హైదరాబాద్: రాష్ట్రంలో కరవు పరిస్థితులను ఎదుర్కోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఎల్‌నినోపై శాస్త్రవేత్తలు ఆరు నెలల ముందే హెచ్చరించినా ప్రభుత్వం స్పందించలేదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన భారాస పార్టీలో చేరికల కార్యక్రమంలో కేటీఆర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన వ్యాపారవేత్త మోరిల్ శ్రీనివాస్‌కు గులాబీ కండువా కప్పి పార్టీలోకి తరువాయి 2లో



## ఇలా దరఖాస్తు.. అలా ఖాతాల్లోకి బోధనం

2లో



## స్కైరూట్ విజయం వేళ..

# రాహుల్ వయసుపై ప్రధాని మోదీ చురకలు

- ప్రైవేట్ రాకెట్ ప్రయోగించిన యువతను ప్రశంసించిన మోదీ
- రాహుల్ గాంధీ వయసును ఉద్దేశించి పరోక్షంగా సెటైర్లు
- స్కైరూట్ బృందం సగటు వయసు 28 అని వెల్లడి
- తాను మాట్లాడుతోంది 56 ఏళ్ల యువకుడి గురించి కాదన్న ప్రధాని

2లో


## త్రిపుర డీజీపీ ఆత్మహత్య..

### పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో తీవ్ర కలకలం



- పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లోని తన కార్యాలయంలోనే ఘటన
- తుపాకితో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమిక నిర్ధారణ
- ఘటనా స్థలాన్ని సందర్శించిన ముఖ్యమంత్రి మాణిక్ సాహా

2లో



# సాధారణ నీటిలో అపార శక్తి..

### భారత సంతతి శాస్త్రవేత్త సంచలన ప్రతిపాదన

- నీటిలో విద్యుత్ ప్రయోగిస్తే భారీ పేలుళ్లు.. శతాబ్దాల రహస్యంపై భారత శాస్త్రవేత్త ముందడుగు
- నీటి అణువుల మధ్య హైడ్రోజన్ బంధాల శక్తి విడుదల వల్లే పేలుళ్లని వెల్లడి
- ఈ సిద్ధాంతం నిరూపితమైతే సాధారణ నీటితోనే స్వచ్ఛ ఇంధనం ఉత్పత్తికి అవకాశం

2లో





## అమెరికా వీసాలపై కొత్త నిబంధన..

### భారత విద్యార్థులు చదువు మధ్యలోనే వెనక్కి రావాల్సిందేనా?

# రామమందిర విరాళాల కేసు

### రాజకీయం చేయవద్దని సుప్రీంకోర్టు హెచ్చరిక



- ఇది కేవలం నేరానికి సంబంధించిన సాధారణ కేసు అన్న ధర్మాసనం
- సీబీఐ విచారణ కోరుతూ దాఖలైన పిటిషన్లపై కోర్టు విచారణ
- యూపీ పోలీసుల దర్యాప్తుపై నివేదికను పరిశీలించిన సర్వోన్నత న్యాయస్థానం

# వచ్చే ఏడాది నాటికి 'క్యూర్'లో ఇందిరమ్మ ఇళ్లు

హైదరాబాద్: ''కాంగ్రెస్ ప్రభుత్వం జీహెచ్ఎంసీ కోర్ ప్రాంతంలో ఇళ్లు నిర్మించి ఇస్తామంటే కొందరు హేళన చేశారు. ఈ పథకం అమలు కాకుంటే విమర్శలు చేయవచ్చని సంతోషపడ్డారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా మేం క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం చుట్టాం. ఏడాది వ్యవధిలోనే లబ్ధిదారులకు అందజేస్తాం'' అని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఈ ప్రాంతాల్లో స్థలాల ధర గజం రూ.2 లక్షల నుంచి రూ.3లక్షలు, ఎకరాకు రూ.250 కోట్ల వరకు పలుకుతోందన్నారు. తొలి విడతలో పైలట్ ప్రాజెక్టు కింద 16 నియోజకవర్గాల్లో గుర్తించిన స్థలాల్లో 7,680 ఇళ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. సచివాలయంలో సోమవారం 'క్యూర్' పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్ల పథకానికి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులు డి.శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, మైనార్టీ శాఖ మంత్రి అజారుద్దీన్, గ్రేటర్ పరిధిలోని ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలతో కలిసి పొంగులేటి శ్రీనివాసరెడ్డి... జ్యోతి వెలిగించి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఇళ్ల వాట్సప్ అప్లికేషన్, మార్గదర్శకాలతో కూడిన బ్రోచర్‌ను విడుదల చేశారు. పథకంపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ... ''గత ప్రభుత్వం నిర్మించిన రెండు పడక గదుల ఇళ్లకు ఎన్నికల ముందు 10 వేల మంది వరకు లబ్ధిదారులను ఎంపిక చేసింది. వారుంటున్న ప్రాంతానికి 35 కిలోమీటర్ల దూరంలో ఇవ్వడంతో లబ్ధిదారులు అక్కడికి వెళ్లలేకపోయారు. మేం పేదలు నివసిస్తున్న ప్రాంతాల్లోనే టవర్లను నిర్మిస్తున్నాం. లబ్ధిదారులకు వాటిలో అన్‌డివైడెడ్ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసి ఇస్తాం. దాని విలువ రూ.40లక్షల నుంచి రూ.60లక్షలు ఉంటుంది. పదేళ్ల వరకు అమ్ముకునే అవకాశముండదు. అవసరానికి బ్యాంకులో రుణం తీసుకోవచ్చు.

**పైరవీలకు తావు లేదు**

వచ్చే ఏడాది బోనాల పండుగను క్యూర్ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల నుంచే ప్రారంభించేలా పనులను శరవేగంగా పూర్తి చేస్తాం. ఇళ్ల కేటాయింపుల్లో పైరవీలకు తావు లేదు. మధ్యవర్తుల మాటలు నమ్మి మోసపోవద్దు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రిజర్వేషన్లు ఉంటాయి. ఇళ్ల కంటే దరఖాస్తుల సంఖ్య ఎక్కువగా ఉంటే డిప్ తీసి లబ్ధిదారులను ఎంపిక చేస్తాం'' అని వివరించారు.

## కరవును ఎదుర్కోవడంలో కాంగ్రెస్ సర్కారు విఫలం

హైదరాబాద్: రాష్ట్రంలో కరవు పరిస్థితులను ఎదుర్కోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఎల్‌నినోపై శాస్త్రవేత్తలు ఆరు నెలల ముందే హెచ్చరించినా ప్రభుత్వం స్పందించలేదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన భారాస పార్టీలో చేరికల కార్యక్రమంలో కేటీఆర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన వ్యాపారవేత్త మోరిల్ శ్రీనివాస్‌కు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ..'రాష్ట్రంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మేడిగడ్డ బ్యారేజీలో రెండు పిల్లర్లు దెబ్బతింటే.. వాటికి మరమ్మతు చేయకుండా మొత్తం ప్రాజెక్టును నిర్వీర్యం చేయడానికి ప్రయత్నించడం సరికాదు. బాన్సువాడ, నిజామాబాద్ జిల్లా రైతులకు నీళ్లందించే అవకాశమున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నీటిని సముద్రంలోకి వదులుతోంది. బాన్సువాడలో మళ్లీ గులాబీ జెండా ఎగరడం ఖాయం' అని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, హనుమంత్ షిండే, జీవన్‌రెడ్డి, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్కైరూట్ విజయం వేళ.. రాహుల్ వయసుపై ప్రధాని చురకలు

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. భారత్‌లో తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన హైదరాబాద్ స్టార్టప్ 'స్కైరూట్ ఏరోస్పేస్'ను అభినందిస్తూనే, రాహుల్ గాంధీ వయసును ఉద్దేశించి ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం పార్లమెంట్ సమావేశాల సందర్భంగా మీడియాతో మాట్లాడిన ప్రధాని, దేశం సాధించిన ఇటీవలి విజయాలను ప్రస్తావించారు. "భారత్ నుంచి తొలి ప్రైవేట్ రాకెట్‌ను ప్రయోగించిన స్కైరూట్ స్టార్టప్ బృందం సగటు వయసు కేవలం 28 ఏళ్లేనని నాకు తెలిసింది. ఇంతటి అతి పిన్న వయస్కులు ఈ ఘనతను సాధించారు. నేను ఇక్కడ 56 ఏళ్ల 'యువకుడి' గురించి మాట్లాడటం లేదు... రోదసిలో త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించిన 28 ఏళ్ల యువత గురించి మాట్లాడుతున్నాను" అని మోదీ పేర్కొన్నారు. జూన్ మాసంలో 56వ ఏట అడుగుపెట్టిన రాహుల్ గాంధీని ఉద్దేశించే ప్రధాని ఈ వ్యాఖ్యలు చేసినట్లు స్పష్టమవుతోంది. హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ శనివారం 'విక్రమ్ 1' రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన సంగతి తెలిసిందే. ఈ ప్రయోగం ద్వారా అమెరికా, చైనాల తర్వాత ప్రైవేట్ ఆర్బిటల్ ప్రయోగ సామర్థ్యాలను కలిగిన మూడో దేశంగా భారత్ రికార్డు సృష్టించింది. ప్రపంచవ్యాప్తంగా కేవలం కొన్ని దేశాలకు మాత్రమే పరిమితమైన ఈ ఘనతను భారత యువత సాధించడం దేశానికే గర్వకారణమని మోదీ కొనియాడారు. గత ఏడాది వర్షాకాల సమావేశాల కంటే ముందు ఓ భారత పౌరుడు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్న అంశాన్ని కూడా ప్రధాని ఈ సందర్భంగా గుర్తుచేశారు. పార్లమెంట్ సమావేశాలు అర్థవంతంగా, ఫలప్రదంగా సాగాలని, ప్రజా సమస్యలపై లోతైన చర్చలు జరగాలని ఆయన ఆకాంక్షించారు.

## త్రిపుర డీజీపీ ఆత్మహత్య.. పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో తీవ్ర కలకలం

త్రిపుర రాష్ట్ర పోలీసు శాఖలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ), 1994 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి అనురాగ్ సోమవారం ఆత్మహత్య చేసుకున్నారు. అగర్తలలోని రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలోని తన ఛాంబర్‌లోనే ఆయన తుపాకితో కాల్చుకుని బలవన్మరణానికి పాల్పడినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. డీజీపీ అనురాగ్ తన కార్యాలయంలోని బాత్రూంలో తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని సిబ్బంది గుర్తించారు. హుటాహుటీన ఆయన్ను సమీపంలోని ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆయన తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. అయితే, ఈ అఘాయిత్యానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనపై త్రిపుర ప్రభుత్వం కానీ, పోలీసు ఉన్నతాధికారులు కానీ ఇప్పటివరకు ఎటువంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి మాణిక్ సాహా వెంటనే పోలీసు హెడ్‌క్వార్టర్స్‌కు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

## అమెరికా వీసాలపై కొత్త నిబంధన..

అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న, పరిశోధనలు చేస్తున్న వేలాది మంది అంతర్జాతీయ విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసేలా అక్కడి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎఫ్1 (విద్యార్థి), జే1 (పరిశోధన) వీసాలపై నాలుగేళ్ల గరిష్ఠ కాలపరిమితిని విధిస్తూ కొత్త నిబంధనను ఖరారు చేసింది. ఈ నిర్ణయం వల్ల విద్యార్థులు తమ డిగ్రీలు, పరిశోధనలు పూర్తికాకముందే దేశం విడిచి వెళ్లాల్సి వస్తుందని 'ఫౌండేషన్ ఫర్ ఇండియా అండ్ ఇండియన్ డయాస్పోరా స్టడీస్' (ఎఫ్ఐఐడీఎస్) అనే భారత సంతతి పాలసీ గ్రూప్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం ఈ కొత్త నిబంధనను జులై 1617 తేదీల్లో ఖరారు చేసిందని, సెప్టెంబర్ మధ్య నుంచి ఇది అమల్లోకి రానుందని ఎఫ్ఐఐడీఎస్ తెలిపింది. దశాబ్దాలుగా అమల్లో ఉన్న "డ్యూరేషన్ ఆఫ్ స్టేటస్" (చదువు పూర్తయ్యే వరకు దేశంలో ఉండేందుకు అనుమతించే విధానం) విధానానికి ఈ కొత్త రూల్ స్వస్తి పలుకుతోంది. దీని ప్రకారం, విద్యార్థులు గరిష్ఠంగా నాలుగేళ్లు మాత్రమే అమెరికాలో ఉండగలరు. ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ), ఎస్‌టీఈఎం ఓపీటీ సమయాన్ని కూడా ఈ నాలుగేళ్ల పరిమితిలోనే లెక్కిస్తారు. అంతేకాకుండా చదువు పూర్తయిన తర్వాత దేశంలో ఉండేందుకు ఇచ్చే గ్రేస్ పీరియడ్‌ను 60 రోజుల నుంచి 30 రోజులకు తగ్గించారు. గడువు పొడిగింపు కోసం విద్యార్థులు తప్పనిసరిగా యూఎస్‌సీఐఎస్ వద్ద ఫారం I539 ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ నిర్ణయంపై ఎఫ్ఐఐడీఎస్ చీఫ్ ఆఫ్ పాలసీ అండ్ స్ట్రాటజీ, ఖండేరావు కండ్ తీవ్రంగా స్పందించారు. "ఇది అమెరికా తన పోటీతత్వానికి తనే పెట్టుకున్న గాయం వంటిది. ఆధునిక డిగ్రీలు పూర్తవడానికి పట్టే సమయానికి, ఈ నాలుగేళ్ల నిబంధనకు పొంతన లేదు. బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేయడానికి సగటున 52 నెలలు, పీహెచ్‌డీకి 5.7 ఏళ్లు పడుతుంది. మరోవైపు, యూఎస్‌సీఐఎస్ వద్ద ఇప్పటికే 1.1 కోట్లకు పైగా కేసులు పేరుకుపోయి, ప్రాసెసింగ్ సమయం ఏడాది పడుతోంది. ఈ పరిస్థితుల్లో విద్యార్థులు చదువులు, పరిశోధనలు మధ్యలోనే వదిలేయాల్సి వస్తుంది. దీనివల్ల పరిశోధనశాలలు కీలక నిపుణులను కోల్పోతాయి. అమెరికా తన ఆవిష్కరణల సామర్థ్యాన్ని ఇతర పోటీ దేశాలకు అప్పగించినట్లే అవుతుంది" అని ఆయన హెచ్చరించారు. పీహెచ్‌డీ, వైద్య శిక్షణ వంటి అనేక పరిశోధనాత్మక ప్రోగ్రామ్‌లు సాధారణంగా నాలుగేళ్లకు మించి కొనసాగుతాయని ఎఫ్ఐఐడీఎస్ పేర్కొంది. జే1 వీసాపై వచ్చే పరిశోధకులు, వైద్యులు తమ ప్రోగ్రామ్‌లను పూర్తి చేయడానికి 5 నుంచి 7 ఏళ్ల సమయం అవసరమని వివరించింది. వీసా పొడిగింపుపై అనిశ్చితి నెలకొనడం వల్ల పరిశోధనలకు ఆటంకం కలగడమే కాకుండా, గ్రాడ్యుయేషన్‌లు ఆలస్యమవుతాయని, అంతర్జాతీయ నిపుణులపై ఆధారపడిన ఫ్యాకల్టీ నియామకాలు కూడా దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో, ఈ నిబంధన అమలును తక్షణమే నిలిపివేయాలని ఎఫ్ఐఐడీఎస్ ప్రభుత్వాన్ని కోరింది. ఎఫ్1, జే1 వీసాదారులకు తిరిగి 'డ్యూరేషన్ ఆఫ్ స్టేటస్' విధానాన్ని పునరుద్ధరించాలని కాంగ్రెస్‌కు విజ్ఞప్తి చేసింది. 48 నెలల కంటే ఎక్కువ సమయం పట్టే గ్రాడ్యుయేట్, ఎస్‌టీఈఎం ప్రోగ్రామ్‌లకు చట్టపరమైన మినహాయింపులు ఇవ్వాలని సూచించింది. మంచి అకడమిక్ రికార్డు ఉన్న విద్యార్థులకు ఆటోమేటిక్ పొడిగింపులు ఇవ్వడం, ఓపీటీ సమయాన్ని నాలుగేళ్ల పరిమితి నుంచి మినహాయించడం, గ్రేస్ పీరియడ్‌ను తిరిగి 60 రోజులకు పునరుద్ధరించడం వంటి పరిపాలనాపరమైన చర్యలు తీసుకోవాలని కోరింది. 2025 శరదృతువులో కొత్త అంతర్జాతీయ విద్యార్థుల నమోదు 17% పడిపోయిందని, దీనివల్ల 1.1 బిలియన్ డాలర్ల ఆదాయ నష్టం, దాదాపు 23,000 ఉద్యోగాల కోత ఏర్పడిందని ఎఫ్ఐఐడీఎస్ గుర్తుచేసింది.

## రామమందిర విరాళాల కేసు రాజకీయం చేయవద్దని సుప్రీంకోర్టు హెచ్చరిక

అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి మందిర విరాళాల దారిమళ్లింపు కేసును రాజకీయం చేయవద్దని సుప్రీంకోర్టు సోమవారం తీవ్రంగా హెచ్చరించింది. ఈ కేసులో సీబీఐ విచారణ జరిపించాలని, ట్రస్టు ఆర్థిక లావాదేవీలపై స్వతంత్ర ఆడిట్ నిర్వహించాలని కోరుతూ దాఖలైన పలు పిటిషన్ల విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది.భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్లను విచారించింది. "ఇది కేవలం నేరపూరిత చర్యకు సంబంధించిన ఒక సాధారణ కేసు. ఈ అంశాన్ని రాజకీయం చేయవద్దని మేము హెచ్చరిస్తున్నాము" అని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ కేసులో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న దర్యాప్తు పురోగతిపై సమర్పించిన నివేదికను పరిశీలించిన తర్వాత తగిన ఆదేశాలు జారీ చేస్తామని కోర్టు పేర్కొంది. భక్తులు సమర్పించిన నగదు, బంగారం, వెండి వంటి విలువైన వస్తువులను శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టులోని కొందరు వ్యక్తులు దారిమళ్లించారన్న ఆరోపణలతో ఈ వివాదం మొదలైంది. యూపీ ప్రభుత్వం నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ప్రాథమిక విచారణ అనంతరం ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ కేసులో ఇప్పటివరకు ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు కేంద్ర సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు వివరించారు. దర్యాప్తు కొనసాగుతున్నందున, మరిన్ని వివరాలను ప్రస్తుతం బహిర్గతం చేయలేమని ఆయన తెలిపారు. ఈ కేసులో నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిగేలా సిట్‌ను పునర్వ్యవస్థీకరించే అంశంపై సూచనలు తీసుకోవాలని కేంద్రాన్ని కోర్టు ఆదేశించింది. అయితే, తప్పుడు ప్రచారాలకు ఆస్కారం ఉంటుందన్న కారణంతో ఎఫ్ఐఆర్, దర్యాప్తు నివేదికలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలన్న అభ్యర్థనను న్యాయస్థానం తిరస్కరించింది. పారదర్శకత కోసం పక్కాగా రికార్డులను నిర్వహించాలని స్పష్టం చేస్తూ, తదుపరి విచారణను వాయిదా వేసింది.

## సాధారణ నీటిలో అపార శక్తి.. భారత సంతతి శాస్త్రవేత్త సంచలన ప్రతిపాదన

సాధారణ నీటిలో విద్యుత్‌ను ప్రవహింపజేసినప్పుడు అనూహ్య రీతిలో భారీ పేలుళ్లు సంభవించడానికి గల కారణాలను తాను కనుగొన్నట్లు భారత సంతతికి చెందిన 84 ఏళ్ల భౌతిక శాస్త్రవేత్త యోగేంద్ర నారాయణ్ శ్రీవాత్సవ వెల్లడించారు. శతాబ్దానికి పైగా శాస్త్రవేత్తలకు అంతుచిక్కని ఈ రహస్యాన్ని తాను ఛేదించానని ఆయన పేర్కొన్నారు. సాధారణ నీటిలోనే అపారమైన శక్తి నిక్షిప్తమై ఉంటుందని, సరైన పరిస్థితుల్లో దానిని వెలికితీయవచ్చని ఆయన ప్రతిపాదిస్తున్నారు. ఈ ఆవిష్కరణ గనుక నిరూపితమైతే భవిష్యత్తులో స్వచ్ఛ ఇంధన ఉత్పత్తికి కొత్త మార్గాలు సుగమం కావచ్చు. ఈ అంశంపై 1907 నుంచే పరిశోధనలు కొనసాగుతున్నాయి. నీటిలో అధిక వోల్టేజీ విద్యుత్‌ను ప్రసరింపజేసినప్పుడు, వినియోగించిన విద్యుత్ కంటే అత్యధిక శక్తితో పేలుళ్లు సంభవించడాన్ని, శీతల పొగమంచు సూపర్‌సోనిక్ వేగంతో వెలువడడాన్ని శాస్త్రవేత్తలు గుర్తించారు. అయితే నీరు వేడెక్కకపోవడంతో, ఈ ప్రక్రియ ఆవిరి వల్ల జరిగింది కాదని వారు నిర్ధారించారు. నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీ ప్రొఫెసర్ అయిన శ్రీవాత్సవ ఈ మిస్టరీకి తనదైన వివరణ ఇచ్చారు. నీటి అణువుల మధ్య ఉండే హైడ్రోజన్ బంధాలలో శక్తి నిల్వ ఉంటుందని, విద్యుత్ ప్రక్రియకు గురైనప్పుడు ఆ బంధాలు ఒక్కసారిగా విచ్ఛిన్నమై అపారమైన శక్తి విడుదలవుతుందని ఆయన సిద్ధాంతీకరించారు. ఈ సిద్ధాంతం రుజువైతే, కేవలం నీటి ఆధారంగా తక్కువ ఖర్చుతో స్వచ్ఛమైన ఇంధనాన్ని ఉత్పత్తి చేసే సాంకేతికతకు దారులు తెరుచుకుంటాయి. ముఖ్యంగా ఇంధన కొరత, కాలుష్యం వంటి తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్న భారత్ వంటి దేశాలకు ఇది ఒక వరంగా మారుతుంది. అయితే, శ్రీవాత్సవ ప్రతిపాదన ప్రస్తుతం ప్రయోగ దశలోనే ఉంది. దీనికి శాస్త్రీయ ప్రపంచం నుంచి ఇంకా అధికారిక ఆమోదం లభించలేదు. గతంలో జరిగిన ప్రయోగాలలో శక్తిని లెక్కించడంలో లోపాలు ఉండి ఉండవచ్చని కొందరు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ సిద్ధాంతాన్ని లోతుగా పరిశీలించేందుకు ప్రైవేట్ నిధులతో త్వరలో ప్రయోగాలు ప్రారంభం కానున్నాయి. రాబోయే కాలంలో జరిగే పరిశోధనలే ఈ వాదనలోని వాస్తవికతను తేల్చనున్నాయి.

## ఇలా దరఖాస్తు.. అలా ఖాతాల్లోకి బోధనం

హైదరాబాద్: రాష్ట్రంలో 202627 విద్యాసంవత్సరం నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ విద్యార్థులకు బోధన ఫీజులు, ఉపకార వేతనాలు వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమ కానున్నాయి. తొలుత దరఖాస్తు చేసిన వారికి.. తొలిప్రాధాన్యం ఉంటుందని ఇప్పటికే ప్రభుత్వం వెల్లడించింది. తొలివిడతలో వచ్చిన దరఖాస్తుల్లో నిబంధనలకు అనుగుణంగా పూర్తిఫీజులు ఆగస్టు 15 నాటికి విడుదల చేస్తామని ప్రకటించింది. ఎస్సీ విద్యార్థులకు రెండేళ్లుగా ఈ విధానం అమలు చేస్తున్నా.. ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ, దివ్యాంగ విద్యార్థులకు ఈ ఏడాది నుంచి కొత్త విధానం అమల్లోకి వస్తోంది. ఈ మేరకు ఎలక్ట్రానిక్ పేమెంట్ అండ్ అప్లికేషన్ సిస్టమ్ ఆఫ్ స్కాలర్‌షిప్స్(ఈపాస్)లో దరఖాస్తు పద్ధతిని మార్చింది. ప్రతి విద్యార్థి పదోతరగతిలోని పేరు.. ఆధార్‌తో సరిపోలాల్సిందే. లేకుంటే దరఖాస్తు ముందుకు కదలదు. పేరు సరిపోలని వారు ఆధార్‌లో మార్చుకోవాల్సిందే. పోస్టు మెట్రిక్ ఉపకార వేతనాలు, బోధన ఫీజుల దరఖాస్తు, పరిశీలన, ఆమోదం, నిధుల విధానాన్ని నోడల్ విభాగమైన ఎస్సీ సంక్షేమశాఖ వివరించింది.

**దరఖాస్తు ఇలా..**

* 2026-27 ఈపాస్ దరఖాస్తు విధానం మూడు అంచెలుగా డెమో ఆథెంటికేషన్, బయోమెట్రిక్ ఆథెంటికేషన్, రిజిస్ట్రేషన్ ఉంటుంది.
* డేస్కాలర్, కాలేజ్ ఎటాచ్డ్ హాస్టల్స్(సీఏఎస్) ఫ్రెషర్స్, రెన్యువల్ విద్యార్థులు నేరుగా, ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులు సంబంధిత వార్డెన్‌ల లాగిన్ ద్వారా దరఖాస్తు చేయాలి.

## రాష్ట్రంలో 81 మంది లిటిగెంట్ పిటిషనర్లను గుర్తించాం: సీఎం చంద్రబాబు

* **సమస్యలు రాకముందే అంచనా వేసి చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం**

రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ సెంటర్‌లో సోమవారం వివిధ శాఖల పనితీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ప్రజా ప్రయోజనం లేకుండా పదేపదే ఫిర్యాదులు చేసే వారిని గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని, ఎల్ నినో ప్రభావంతో ఏర్పడిన వర్షాభావ పరిస్థితులను ఎదుర్కోవడానికి సిద్ధం కావాలని అధికారులను ఆదేశించారు. కొంతమంది ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వాన్ని, అధికారులను బద్నాం చేసేందుకే పిటిషన్లు వేస్తున్నారని సీఎం అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 81 మంది లిటిగెంట్ (సమస్యాత్మక) పిటిషనర్లను గుర్తించామని, వీరు ఒక్కొక్కరు సగటున 246 పిటిషన్లు వేస్తున్నారని తెలిపారు. వీరి వివరాలను కలెక్టర్లకు పంపి, వారు పెట్టే అర్జీల్లో ప్రజా ప్రయోజనం ఉంటేనే పరిశీలించాలని స్పష్టం చేశారు. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం వల్ల రాష్ట్రంలో 49 శాతం లోటు వర్షపాతం నమోదైందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రభావం నుంచి బయటపడటానికి ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలని సూచించారు. ఆరుతడి పంటలు (డ్రై క్రాప్స్) వేసేలా రైతులను ప్రోత్సహించాలని, వారిలో అవగాహన కల్పించాలని చెప్పారు. జలధార పనులను వీబీజీ రామ్‌జీ పనులతో అనుసంధానం చేసి పెద్ద ఎత్తున చేపట్టాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఆర్థికేతర అంశాలకు తక్షణ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఎప్పటికప్పుడు ప్రజాభిప్రాయం తెలుసుకుంటూ, సమస్యలు రాకముందే అంచనా వేసి చర్యలు తీసుకోవాలని పరిపాలన విధానాల్లో మార్పులు సూచించారు.

## ఎరువుల విక్రయాల్లో తేడాలు.. కలెక్టర్ ఆగ్రహం



జనగామ, ప్రజాస్ఫూర్తి : కొడకండ్ల మం డలం గిర్నీ తండాలోని శ్రీ అభయ్ ఫర్టిలైజర్స్ దుకాణాన్ని జిల్లా కలెక్టర్ సందీ ప్ కుమార్ ఝా ఆకస్మికంగా తనిఖీ చే శారు. ఈ సందర్భంగా లైసెన్స్, కొనుగోలు రిజిస్టర్లు, యూరియా, కాంప్లెక్స్ ఎ రువుల నిల్వలను పరిశీలించారు. ఈ పాస్ యంత్రంలో నమోదైన కొనుగోలు వివరాలు, గోదాంలో ఉన్న యూరియా నిల్వల మధ్య తేడాలను గుర్తించిన కలె క్టర్ దీనిపై వివరణ ఇవ్వాలని మండల వ్యవసాయ అధికారిని ఆదేశించారు. ఇ లాంటి తేడాలు పునరావృతం కాకుండా ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి స్టాక్,అమ్మకాల వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు.ఎరు వుల నిల్వలు, సరఫరా, విక్రయాలన్నీ యూరియా యాప్ ద్వారా నమోదు చే యాలని, స్టాక్ రిజిస్టర్లు, స్టాక్ బోర్డును తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశిం చారు. నకిలీ విత్తనాలు, కల్తీ ఎరువుల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. రైతులకు ఎలాం టి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా లో ఎరువుల నిల్వలు సమృద్ధిగా ఉండేలా డీలర్లు, వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సరఫరా,విక్రయా లను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్ట ర్ ఆదేశించారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.... అనుమానస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి

*** రూరల్ పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎడవల్లి శ్రీనివాసరెడ్డి**



రఘునాథపల్లి, ప్రజాస్ఫూర్తి : ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని అనుమానస్పద వ్యక్తులు కదలికలపై ఎప్పటికప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని రూరల్ పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎడబెల్లి శ్రీనివాస్ రెడ్డి, సబ్ ఇన్స్పెక్టర్ నరేష్ యాదవ్ కోరారు.సోమవారం వారు మాట్లాడుతూ ప్రజలు దూరప్రాంతాలకు వెళ్ళేటప్పుడు విలువైన వస్తువులను బ్యాంకులో పెట్టాలని, ఊరికి వెళ్లేటప్పుడు ఇంటి పక్క వారికి సమాచారం ఇవ్వాలని ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలను ఇంటి వద్ద ఏర్పాటు చేసుకోవాలని వారు కోరారు. సైబర్ క్రైమ్ మోసానికి గురైన వెంటనే 1930 నెంబర్ కు సంప్రదించి సాయం పొందాలని వారి కోరారు. గ్రామాల వారిగా దొంగతనాలు జరుగకుండా ఉండేందుకు పోలీసులు రాత్రి వేళలో గస్తీలు తిరుగుతున్నారని ఎక్కడైనా దొంగతనం జరిగిన వెంటనే పోలీసులకు సమాచారాన్ని అందిచాలని కోరారు. వాహనదారులు ద్విచక్ర వాహనదారులు ఇంటి వద్ద పెట్టేటప్పుడు వాటికి తాళం వేసుకోవాలని కోరారు.

## ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలి

*** రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి , డిఆర్వో జయమ్మ తో కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 92 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 56 ,సర్వే ల్యాండ్స్ 9, గ్రామీణ అభివృద్ధి 6, మున్సిపాలిటీ 4,సంక్షేమ శాఖ 3, పంచాయతీ 3, డిసి ఓ 2, ఇరిగేషన్ 2, వైద్య ఆరోగ్య 2,ఎస్సీ కార్పొరేషన్ , ఎస్సీ డెవలప్మెంట్, ఆర్ అండ్ బి, ఉపాధి కల్పన, జిల్లా పరిషత్ శాఖలకు ఒక్కటి చొప్పున వచ్చాయని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు సాత్విక్, హౌసింగ్ పీడీ అలివేలు , ఆర్డీవో కృష్ణారెడ్డి , వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## రక్తదానం.. ప్రాణదానం

**- మహా రక్తదాన శిబిరం ప్రారంభం**

**- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: రక్తదానం.. మరొకరికి ప్రాణదానంతో సమానమని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం గట్టు శ్రీరాములు ఫంక్షన్ హాల్ లో ఆయాన్స్ భార్గవ్ సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహా రక్తదాన శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి హాజరై, రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఆరోగ్యకరమైన వ్యక్తి రక్తదానం చేయవచ్చన్నారు. ఒక వ్యక్తి చేసిన రక్తదానం మరొకరి ప్రాణాలను కాపాడుతుందన్నారు. రక్తదానంపై ఉన్న అపోహలను నమ్మవద్దన్నారు. ఆరోగ్యకరమైన ప్రతి ఒక్క వ్యక్తి రక్తదానాన్ని అలవాటుగా చేసుకోవాలని సూచించారు. రక్తదానం చేసిన యువకులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. సమాజానికి మేలు చేసే ఇలాంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఆయాన్స్ భార్గవ్ సేవ ట్రస్ట్ నిర్వాహకులు బోదుల మురళి, రిజ్వాన్ లను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, చౌటుప్పల్ మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్, కౌన్సిలర్లు పాక చిరంజీవి, చింతల ఉమామహేశ్వరి సాయిలు, ట్రస్ట్ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాబోయే పరిస్థితులను సమర్థవంతంగా
# ఎదుర్కొనేందుకు అధికారులు ప్రజలకు అండగా నిలబడాలి

*** మంత్రి, ఉమ్మడి నల్గొండ జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్డూరి లక్ష్మణ్ కుమార్..**



ప్రజాస్ఫూర్తి నల్లగొండ : రాబోయే పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికారులు అన్ని రకాలుగా ప్రజలకు అండగా నిలబడాలని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, ఎస్టీ సంక్షేమ శాఖల మంత్రి, ఉమ్మడి నల్గొండ జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్డూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సోమవారం నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణంలోని ఉదయాదిత్య భవన్లో ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనే సంసిద్ధత, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం, తదితర అంశాలపై ఏర్పాటు చేసిన ఉమ్మడి నల్గొండ జిల్లా సమీక్ష సమావేశానికి అడ్లూరు లక్ష్మణ్ అధ్యక్షత వహిస్తూ ఎల్ నినో వల్ల ఎదురయ్యే పరిస్థితులను ఎదుర్కోవడంలో అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎల్ నినో వల్ల రాబోయే రోజుల్లో అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నందున ప్రత్యేకించి వ్యవసాయం, సాగునీరు, తాగునీరు అన్నింటికి సమస్యలు వచ్చే అవకాశం ఉందని అన్నారు. రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎల్ నినో వల్ల అంతర్జాతీయ స్థాయిలో విపత్కర పరిణామాలు ఏర్పడతాయన్నారు. రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వల్ల ఏర్పడే పరిస్థితులను ఎదుర్కోవడంలో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ జిల్లా ప్రజలకు అండగా నిలబడాలని కోరారు. ఎల్ నినో వల్ల ఏర్పడ్డ కరువు పరిస్థితులతో ప్రజలు అధైర్య పడవద్దని, రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలన్నారు. అనంతరం ఈ సమావేశంలో వ్యవసాయం, నీటిపారుదల, ఉద్యాన, విద్యుత్తు, మిషన్ భగీరథ ,భూగర్భ జల ,గ్రామీణ అభివృద్ధి, పశుసంవర్ధక శాఖలపై సమీక్షించారు. ఈ సందర్భంగా తెలంగాణ జలసిరిపై రూపొందించిన గోడపత్రికను మంత్రులు, ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య , మందుల సామేలు , పద్మావతి రెడ్డి, బాలు నాయక్, జగదీశ్వర్ రెడ్డి , ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, వేముల వీరేశం, నల్గొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ , ప్రభుత్వ విప్ , నకిరేకల్ శాసనసభ్యులు నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, స్పెషలాఫీసర్, రాష్ట్ర కార్మిక మరియు ఉపాధి కల్పన సెక్రటరీ దాసరి హరిచందన, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్, యాదాద్రి భువనగిరి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, మున్సిపల్ చైర్మన్లు, నల్గొండ రెవెన్యూ, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్లు జె. శ్రీనివాస్, ప్రేమ్ కరణ్ రెడ్డి ,ఆయా జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక శోభతో శ్రీ జగన్నాథ స్వామి రథయాత్ర



జనగామ, ప్రజాస్ఫూర్తి : హరే కృష్ణ హరే రామ భక్తబృందం,గీతాశ్రమం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన శ్రీ జగన్నాథ స్వామి రథయాత్ర పట్టణంలో భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా నిర్వహించారు. బస్టాండ్ చౌరస్తా నుంచి ప్రారంభమైన రథయాత్ర వాస్తు గణపతి దేవాలయం మీదుగా రైల్వే స్టేషన్ వరకు సాగింది. ఈ యాత్రను మున్సిపల్ చైర్పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్, డీసీపీ రాజమహేంద్ర నాయక్ స్వామి వార్ల రథం తాడును లాగి ప్రారంభించారు.పట్టణ ప్రధాన వీధుల గుండా సాగిన రథయాత్రలో భక్తులు హరినామ సంకీర్తనలతో పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు. మార్గమధ్యంలో పలు చోట్ల ప్రజలు హారతులు ఇచ్చి స్వామి వారికి ఘన స్వాగతం పలికారు. రథయాత్ర అనంతరం రైల్వే స్టేషన్ కూడలి వద్ద భక్తులకు మహాప్రసాదంతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధనుంజయ్ పండిత్ దాస్, మాధవ్ గోవింద దాస్ ప్రభు, శ్రీ సనాతన దాసు, పద్మావతి దేవి దాసి, కృష్ణ భావ దేవి దాసి, బాలమణి, వైరు వెంకన్న, నాగేందర్, ధర్మపురి శ్రీను, అరుణ్, పరశురాములు, విజయ్, సిద్ధు లు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి సూపర్ బజార్ పునర్నిర్మాణం చేపట్టాలి

**– జిఎంకి 16వ డివిజన్ కార్పొరేటర్ పద్మ వినతి**



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: కార్పొరేషన్ పరిధిలోని రామవరం 16వ డివిజన్ మార్కెట్ ఏరియాలోగల పాత సూపర్ మార్కెట్ ఏరియాలో నూతన బిల్డింగ్ నిర్మాణం చేసి రామవరం ప్రాంత అభివృద్ధికి సహకరించాలని కార్పొరేటర్ మునిగడప పద్మ కోరారు. ఈ మేరకు సోమవారం కొత్తగూడెం ఏరియా జీఎం షాలెంరాజు కి వినతిపత్రం అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రామవరం ప్రాంతానికి పూర్వ వైభవం కోసం మార్కెట్ ఏరియాలోగల పాత సూపర్ మార్కెట్లో నూతన భవనం నిర్మాణం చేపట్టి దానిలో సూపర్ మార్కెట్ ఏర్పాటు చేయాలని కోరారు. తద్వారా దాని చుట్టూ ఉన్నటువంటి కూరగాయలు, పండ్లు, పూలు ఇతర షాపులు నడుపుకునే వారికి జీవనోపాధి లభిస్తుందన్నారు. జీఎం మాట్లాడుతూ ఇప్పటికే ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఇచ్చిన వినతి మేరకు కొత్తగూడెం, రామవరం సింగరేణి సూపర్ బజార్ల నిర్మాణంకు సంబంధించిన ఫైల్ ప్రాసెస్లో ఉందని చెప్పారు. కార్పొరేటర్ వెంట న్యాయవాది, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మునిగడప వెంకటేశ్వర్లు, వనందాస్గడ్డ శాఖ-2 కార్యదర్శి ఎస్. కె.జలీల్ ఉన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సూర్యాపేట జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సిఐటియు అనుబంధ సంస్థ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిసిడబ్ల్యు యు జిల్లా ప్రధాన కార్యదర్శి యల్క సోమయ్య గౌడ్, జిల్లా అధ్యక్షులు అనంతుల మల్లయ్య మాట్లాడుతూ సిఎస్ సి ద్వారా అమలు చేస్తున్న ఆరోగ్య పరీక్షలు రద్దుచేసి కార్మికులందరికీ ప్రభుత్వం హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇచ్చిన జీవో నెంబర్ 12 రద్దుచేసి వెల్ఫేర్ బోర్డు ద్వారానే కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సహజ మరణానికి నష్టపరిహారం రెండు లక్షల నుండి ఐదు లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్ లు రద్దు చేయాలని అన్నారు. వెల్ఫేర్ బోర్డులో ఉన్న పెండింగ్ క్లెయిమ్స్ కు వెంటనే నిధులు మంజూరు చేయాలని, 55 సంవత్సరాలు నిండిన కార్మికులకు పెన్షన్ నెలకు రూ.6000లు పిల్లల చదువుకు స్కాలర్ షిప్ లు, గృహవసతి, అడ్డాలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి నెమ్మది వెంకటేశ్వర్లు, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

*** గురుకులాల్లో నాణ్యమైన విద్య, పోషకాహారం అందించాలి**

*** జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.**



జనగామ, ప్రజాస్ఫూర్తి : గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, పోషకాహారం అం దించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమా ర్ ఝా అధికారులను ఆదేశించారు. సోమవారం కొడకండ్ల మండలం మొండ్రాయిలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యా బోధన, మౌలిక సదుపాయాలు, పరిశుభ్రత, ఆహార నాణ్యతను పరిశీలించారు. స్టోర్‌రూమ్ ను తనిఖీ చేసిన కలెక్టర్, పాత పుస్తకాలు, ఉపయోగం లేని వస్తువులను వెంటనే తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అనంతరం కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలించి ప్రతి విద్యార్థికి కంప్యూటర్ పరిజ్ఞానం పెంపొందించేలా శిక్షణ ఇవ్వాలని సూచించారు. 10వ తరగతి గదిని సందర్శించిన కలెక్టర్ గణిత ఉపాధ్యాయురాలికి, విద్యార్థులకు గణిత సమస్యలు ఇచ్చి వారి అభ్యాస సామర్థ్యాన్ని పరీక్షించారు. అనంతరం వాటిని సులభంగా పరిష్కరించే విధానాన్ని స్వయంగా వివరించారు. హిందీ పాఠ్యపుస్తకంలోని పాఠాలను చదివి వినిపిస్తూ ఉచ్చారణ, భావవ్యక్తీకరణ పై విద్యార్థులకు సూచనలు చేశారు. ప్రతి రోజూ పఠనాభ్యాసం నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్ వారు తీసుకుంటున్న అల్పాహారం, పోషకాహారం గురించి ఆరా తీశారు. పాలు సహా అందించే ఆహారాన్ని పూర్తిగా తీసుకోవాలని సూచించారు. అనంతరం వంటశాలను, మెనూ చార్ట్‌ను పరిశీలించి ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారమే నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. నాణ్యతలో రాజీ పడినా, మెనూ పాటించకపోయినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, పరిశుభ్రమైన వాతావరణం, క్రమశిక్షణ, పోషకాహారం, ఆధునిక విద్యా సదుపాయాలు అందేలా అధికారులు,ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు.



## నీట్ పేపర్ లీక్ పై కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి

*** సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు**

ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం : నీట్ పేపర్ లీకుకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఢిల్లీలో సిజెపి , విద్యార్థి సంఘాలు తలపెట్టిన పార్లమెంటు ర్యాలీ,ధర్నాకు సంఘీభావం తెలుపుతూ కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నీట్ పరీక్ష పేపరు లీకు అవడం వలన ఇరవై రెండు లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టి వేయబడిందని దీనికి బాధ్యత వహించాల్సిన ప్రభుత్వం బాధ్యత వహించకపోగా విద్యార్థులకు న్యాయం చేయమని అడుగుతున్నందుకు నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం నిరాహార దీక్ష చేపట్టిన సామాజిక కార్యకర్త సోనం వాంగ్ చుక్ తో చర్చలు జరిపి దీక్షను విరిమింప చేసేలాగా ప్రభుత్వ చర్యలు ఉండాలన్నారు. క్యాబినెట్ నుండి మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య , జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు , జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్ ,టౌన్ కార్యదర్శి వర్గ సభ్యులు సందకూరి లక్ష్మి , నందిపాటి రమేష్, నాయకులు విజయగిరి శ్రీనివాస్ , ప్రకాష్ , గడల నరసింహారావు , రమేష్ , బాబు ,బాలకృష్ణ , రాములు , రఘు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మొద్దు

**: ఎమ్మెల్యే కడియం శ్రీహరి**



స్టేషన్ ఘనపూర్ / జనగామ, ప్రజా స్ఫూర్తి : ఎల్‌నీనో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, దీనిని కాంగ్రెస్ ప్రభుత్వం పై నెట్ట డం బాధ్యతాయుతమైన నాయకులకు తగదని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. సోమవారం స్టేషన్ ఘనపూర్ లోని తన కార్యాలయంలో ఏర్పాటు చే సిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని ప్రధాన నదుల్లో ఆశించిన స్థాయిలో నీటి ప్రవాహం లేదని, ప్రస్తుతం గోదావరిలో ఉన్న 16 వేల క్యూసెక్కుల ప్రవాహంతో నీటిని ఎత్తిపో సే అవకాశం లేదని తెలిపారు. మెడిగడ్డ బ్యారేజ్ కాళేశ్వరం ప్రాజెక్టుకు కీలకమ ని, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) సూచనల మేరకే ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. రైతులు ప్రస్తుత పరిస్థితులను అర్థం చేసుకొని ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచిం చారు. బీఆర్ఎస్ ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్ద ని, నియోజకవర్గంలోని రిజర్వాయర్లను దేవాదుల ద్వారా నింపి రైతులకు సాగు నీరు అందించేందుకు చర్యలు తీసు కుంటున్నామని ఎమ్మెల్యే కడియం శ్రీ హరి తెలిపారు.

## కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా దేవేందర్‌రావు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : శ్రీ రాధాకృష్ణ గీత మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అఖిల భారత తెలంగాణ సకల కళాకారుల సంఘం భూపాలపల్లి జిల్లా శాఖకు నూతన అధ్యక్షుడిగా టేకుమట్ల మండలానికి చెందిన ప్రముఖ జానపద కళాకారుడు పోలసాని దేవేందర్‌రావు నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మయ్య ఈ మేరకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దేవేందర్‌రావు మాట్లాడుతూ కళాకారుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. జిల్లాలోని జానపద కళాకారులను సంఘంలో సభ్యులుగా చేర్చి వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అలాగే కళాకారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయడంతో పాటు, జానపద కళల పరిరక్షణ, అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు చేపడతానని చెప్పారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మయ్య, జిల్లా కళాకారులు, సంఘ సభ్యులు దేవేందర్‌రావుకు శుభాకాంక్షలు తెలియజేసి, ఆయన నాయకత్వంలో కళాకారుల సంక్షేమానికి మరింత ఊతం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# వ్యవసాయానికి పరిశ్రమల తోడ్పాటుతోనే రైతుల ఆదాయం పెరుగుతుంది

* **డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**
* **గోద్రెజ్ సమీకృత (ఇంటిగ్రేటెడ్) ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీని ప్రారంభించిన డిప్యూటీ సీఎం**

ప్రజాస్ఫూర్తి, ఖమ్మంజిల్లా : వ్యవసాయాన్ని పరిశ్రమలతో అనుసంధానం చేసి విలువ ఆధారిత ఉత్పత్తులను ప్రోత్సహించినప్పుడే రైతుల ఆదాయం స్థిరంగా పెరుగుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఖమ్మం జిల్లా కొణిజెర్ల మండలం అంజనాపురంలో తెలంగాణ ప్రభుత్వ సహకారంతో నిర్మించిన గోద్రెజ్ సమీకృత (ఇంటిగ్రేటెడ్) ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క మల్లు, రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, గోద్రెజ్ ఇండస్ట్రీస్ చైర్‌పర్సన్ నాదిర్ బి. గోద్రెజ్, గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సునీల్ కటారియా, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్, జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్, సిపి సునీల్ దత్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ లతో కలిసి సోమవారం ఘనంగా ప్రారంభించారు. అనంతరం ఫ్యాక్టరీలోని ఉత్పత్తి విభాగాలు, ఆయిల్ పామ్ గెలల ప్రాసెసింగ్ యూనిట్లు, నాణ్యత నియంత్రణ వ్యవస్థను పరిశీలించి సంస్థ ప్రతినిధులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ ఖమ్మం జిల్లా వ్యవసాయానికి చిరునామాగా నిలిచిందన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒకప్పుడు హెవీ వాటర్ ప్లాంట్, థర్మల్ పవర్ స్టేషన్, నవభారత్ వంటి పరిశ్రమలు ఉండేవన్నారు. రైతుల ఆదాయం పెరగాలంటే సంప్రదాయ పంటలతో పాటు ఆయిల్ పామ్ వంటి అధిక ఆదాయం ఇచ్చే వాణిజ్య పంటల సాగు వైపు మళ్లడం అవసరమన్నారు. ఈ అంశాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు సమగ్రంగా వివరించారని కొనియాడారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా గోద్రెజ్ సంస్థ ఆయిల్ పామ్ గెలల కొనుగోలు లో రైతులకు భాగస్వామిగా నిలుస్తోందని తెలిపారు. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణలో ఆయిల్ పామ్ ఆధారిత పరిశ్రమలను అభివృద్ధి చేసే అవకాశాలు మరింత విస్తరించాయని, దేశంలోనే ఆయిల్ పామ్ హబ్‌గా తెలంగాణను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.వ్యవసాయ అనుబంధ పరిశ్రమలను ప్రోత్సహించడం రాష్ట్ర ప్రభుత్వ విధానమని తెలిపారు. గోద్రెజ్ సంస్థ మరో పరిశ్రమను కూడా ఖమ్మంలో ఏర్పాటు చేయాలనుకుంటే అవసరమైన భూమిని కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఆయిల్ పామ్ సాగు విస్తరణతో పాటు వ్యవసాయ ఆధారిత పరిశ్రమల అభివృద్ధే తెలంగాణ రైతుల ఆర్థికాభివృద్ధికి బాటలు వేస్తుందని, ఖమ్మం జిల్లా దేశంలోనే ఆయిల్ పామ్ రంగానికి ఆదర్శంగా నిలుస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆశాభావం వ్యక్తం చేశారు.వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది డిసెంబర్‌లో తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్ ను విడుదల చేసిందని తెలిపారు. ఆ విజన్‌కు అనుగుణంగా వ్యవసాయ రంగ అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ రూపొందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా, సుడా చైర్‌పర్సన్ దుర్గా ప్రసాద్ , రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, సర్పంచ్ లు, గోద్రెజ్ సంస్థ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆయిల్ పామ్ రైతులు, పెద్ద సంఖ్యలో ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



## పోక్సో కేసులో నిందితుడికి 20 సం. కఠిన కారాగార శిక్ష

* **జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు**



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: మెదక్ జిల్లా హవేలి ఘనపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 17 సంవత్సరాల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడు చాకలి ప్రవీణ్ (21 సంవత్సరాలు)కు జిల్లా పోక్సో ఫాస్ట్ ట్రాక్ కోర్టు 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు తెలిపారు. కేసు వివరాలు వెల్లడిస్తూ. నిందితుడు చకలి ప్రవీణ్ అదే ప్రాంతానికి చెందిన 17 సంవత్సరాల ఇంటర్మీడియట్ చదువుతున్న బాలికను బెదిరించి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. దాని ఫలితంగా బాధిత బాలిక గర్భం దాల్చింది. తన మేనత్త వద్ద ఉంటూ చదువుకుంటున్న బాలికను, ఆమె స్నానం చేస్తున్న సమయంలో కడుపు ఎత్తుగా కనిపించడంతో అనుమానం వచ్చిన మేనత్త ప్రశ్నించగా, నిందితుడు ఇంట్లోకి వచ్చి బెదిరిస్తూ పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు బాలిక వెల్లడించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు హవేలి ఘనపూర్ పోలీస్ స్టేషన్‌లో అప్పటి ఏఎస్సై డి. విఠల్ కేసు నమోదు చేశారు. అనంతరం అప్పటి దర్యాప్తు అధికారి, మెదక్ రూరల్ సీఐ పాలవెల్లి కేసును సమగ్రంగా దర్యాప్తు చేసి, అవసరమైన సాక్ష్యాధారాలను సేకరించి న్యాయస్థానంలో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసు విచారణ సందర్భంగా భరోసా లీగల్ అడ్వైజర్ శ్వేత బాధిత బాలికకు సాక్ష్యం చెప్పే విషయంలో అవసరమైన సహకారం అందించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య బలమైన వాదనలు వినిపించారు. సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా పోక్సో ఫాస్ట్ ట్రాక్ కోర్టు న్యాయమూర్తి నిందితుడిపై అభియోగాలు రుజువైనట్లు నిర్ధారించి, 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించిన్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కేసులో లైజనింగ్ అధికారి ఎస్సై విఠల్, కానిస్టేబుల్ కృష్ణ, సీడీవో గౌస్ కేసు లో సహకరించారు. ఈ కేసులో శిక్ష పడేవిధంగా కృషి చేసిన సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ. బాలికలు, మహిళలపై లైంగిక నేరాలకు పాల్పడే వ్యక్తుల పట్ల చట్టం ఎలాంటి ఉపేక్ష చూపదని, పోక్సో చట్టం కింద నమోదయ్యే కేసుల్లో మెదక్ జిల్లా పోలీసులు వేగవంతమైన, శాస్త్రీయ దర్యాప్తు చేపట్టి నిందితులకు కఠిన శిక్షలు పడేలా అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.చిన్నారులపై ఎలాంటి లైంగిక వేధింపులు, దాడులు లేదా దుర్వినియోగం జరిగినా భయపడకుండా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు, డయల్ 100, డయల్ 112 లేదా 1098 చైల్డ్ హెల్ప్‌లైన్కు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

## ప్రజావాణి అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

**: కలెక్టర్ రాహుల్ శర్మ**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ,ప్రజాస్ఫూర్తి : ప్రజావాణిలో ప్రజలు అందజేసే అర్జీలను ఆలస్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 78 దరఖాస్తులు అందాయని తెలిపారు. ప్రతి అర్జీని అధికారులు నిశితంగా పరిశీలించి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం సీఎం ప్రజావాణి, జిల్లా ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం, పెండింగ్‌లో ఉన్న వినతులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం సీఎం ప్రజావాణికి సంబంధించిన 57 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని తక్షణమే పరిష్కరించి తీసుకున్న చర్యలపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డీఆర్ఓ వసంత కుమారి, ఆర్డీఓ హరికృష్ణ, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## వర్షాలు కురవాలని మీర్జాపూర్ గ్రామస్తుల పూజలు



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : మిర్జాపూర్ గ్రామంలో వర్షాల కోసం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం గ్రామస్తులకు వరద పాశం చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి గ్రామంలో సకాలంలో పంటలు పండాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ మిర్జాపూర్ గ్రామంలోని ముసలమ్మ కుంట వద్ద నేడు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పాండవుల బండ వద్ద కూడా గ్రామ పెద్దలు, భక్తులు కలిసి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి గ్రామ ప్రజలకు సంప్రదాయబద్ధంగా వరద పాశం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వేల్పుల సంపత్ కుమార్ మాట్లాడుతూ అమ్మవారి కటాక్షంతో గ్రామంలో మంచి వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండాలని, పంటలు సమృద్ధిగా పండాలని, ప్రతి రైతు ఇంట ధాన్యరాశులు పేరుకుపోయేలా గ్రామం సిరిసంపదలతో కళకళలాడాలని ప్రార్థించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వార్డు సభ్యులు, రైతులు మహిళలు, యువకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీర్వాదాలు పొందారు.

## ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో షీ టీం అవగాహన సదస్సు

* **గుడ్ టచ్–బ్యాడ్ టచ్, సైబర్ నేరాలపై విద్యార్థినులకు అవగాహన**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు జిల్లా షీ టీం ఆధ్వర్యంలో విద్యార్థినులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీం ఎస్సై ఫజల్ ఖాన్ మాట్లాడుతూ గుడ్ టచ్-బ్యాడ్ టచ్, మహిళలపై వేధింపులు, స్ట్రీట్ హరాస్మెంట్, వ్యక్తిగత భద్రత, సైబర్ నేరాల నివారణ వంటి అంశాలపై విద్యార్థినులకు వివరించారు. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, వీడియో కాల్స్‌కు స్పందించవద్దని, సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు. విద్యార్థినులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి చదువుపై పూర్తి దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని, తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. పాఠశాల పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, మహిళలు లేదా బాలికల పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా వెంటనే షీ టీంకు సమాచారం అందించాలని కోరారు. షీ టీం మొబైల్ నంబర్ 8712658162కు ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచి నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100, సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

## భూపాలపల్లిలో ఈ నెల 23న మెగా జాబ్ మేళా

* **నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు**
* **రెండు ప్రముఖ సంస్థల్లో 30 ఖాళీలు**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ,(ప్రజా స్ఫూర్తి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా ని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 23న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి శ్రీ మునిమాడి మల్లయ్య తెలిపారు. భూపాలపల్లిలోని రోజన్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల, బీఎస్ హాస్టల్ ప్రాంగణంలో ఉదయం 11 గంటలకు జాబ్ మేళా ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.ఈ జాబ్ మేళాలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ (BDE) పోస్టులకు 10 ఖాళీలు ఉన్నాయి. 23 నుంచి 33 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన ఎంబీఏ, బీటెక్ లేదా ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులు. ఎంపికైన వారికి నెలకు రూ.17,500 నుంచి రూ.20,000 వరకు వేతనం అందించనున్నట్లు తెలిపారు.అలాగే బ్లూ డార్ట్ కొరియర్ సంస్థలో డెలివరీ బాయ్స్ పోస్టులకు 20 ఖాళీలు ఉన్నాయి. 18 ఏళ్లు నిండిన ఇంటర్ లేదా డిగ్రీ అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. బైక్, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి. ఎంపికైన వారికి రూ.17 వేల టేక్ హోమ్ జీతంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ, పెట్రోల్ అలవెన్స్ తదితర సౌకర్యాలు కల్పిస్తారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హతల ధ్రువపత్రాలతో పాటు బయోడేటా తీసుకుని ఈ నెల 23న ఉదయం 11 గంటలకు నేరుగా హాజరుకావాలని అధికారులు సూచించారు. మరిన్ని వివరాలకు 9502468800 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

## రేగొండ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన అడిషనల్ ఎస్పీ



జయశంకర్ భూపాల పల్లి జిల్లా, (ప్రజా స్ఫూర్తి): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పోలీసు సేవలను మరింత సమర్థవంతంగా అందించే లక్ష్యంతో జిల్లా అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్ సోమవారం రేగొండ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, సీసీ కెమెరాల పనితీరు, స్టేషన్ పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని పోలీసు అధికారులకు సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎప్పుడూ అప్రమత్తంగా వ్యవహరించాలని, నేరాల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని, ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించేందుకు బాధ్యతాయుతంగా పనిచేయాలని సిబ్బందికి అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్ ఆదేశించారు.

## అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2026 27 విద్యా సంవత్సరానికి గాను అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు సోమవారం ప్రిన్సిపల్ ప్రొఫెసర్ హుస్సేన్ తెలిపారు. ఇంగ్లీషు లో 2, తెలుగులో 2, హిందీలో 1, కామర్స్ లో 1, కంప్యూటర్ సైన్స్ లో 3, హిస్టరీలో 2, పొలిటికల్ సైన్స్ లో 1 పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. పీహెచ్డీ, నెట్, సెట్ అర్హత కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. జనరల్ అభ్యర్థులకు సంబంధిత పీజీలో 55% మార్కులు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50% మార్కులు ఉండాలి. . జూలై 23 గురువారం సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తులు అందజేయాలి. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శుక్రవారం జూలై 24 , ఉదయం 10 గంటల నుండి డెమో ఉంటుందని తెలిపారు.

## దివ్యాంగులకు ట్రాన్స్జెండర్ సర్టిఫికెట్లకు దరఖాస్తుల ఆహ్వానం

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి: దివ్యాంగుల సాధికారత కోసం తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ట్రాన్స్‌జెండర్ గుర్తింపు కార్డులు, ఐడీ కార్డుల జారీకి జిల్లా యంత్రాంగం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి తెలిపారు. అభ్యర్థులు www. wdsc.telangana.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని అవసరమైన ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అనంతరం నోటిఫికేషన్‌లో పేర్కొన్న తేదీన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో నిర్వహించే వైద్య పరీక్షలకు హాజరుకావాలని సూచించారు. పరీక్షలో అర్హత సాధించిన వారికి ట్రాన్స్‌జెండర్ గుర్తింపు కార్డులు జారీ చేయనున్నట్లు వెల్లడించారు.దరఖాస్తు ప్రక్రియకు సంబంధించి ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని, సింగిల్ కమిటీ ఆమోదం పొందిన తర్వాత మాత్రమే గుర్తింపు కార్డులు జారీ అవుతాయని తెలిపారు. పూర్తి వివరాలకు జిల్లా సంక్షేమాధికారి కార్యాలయాన్ని సంప్రదించాలని అధికారులు సూచించారు.

## మార్కెట్ యార్డ్ పరిశుభ్రతే లక్ష్యం

* **పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న ఏఎంసీ చైర్మన్**




ప్రజాస్ఫూర్తి. , కొత్తగూడెం : కొత్తగూడెం పట్టణంలో గల మార్కెట్ యార్డు లో జరుగుచున్న పారిశుధ్య పనులను ఏఎంసీ చైర్మన్ లాల్ సింగ్ నాయక్ పర్యవేక్షించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, వ్యాపారులు నిత్యం రాకపోకలు సాగించే మార్కెట్ యార్డ్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక ఫోకస్ పెట్టామని ఆయన అంటూ , వరద నీరు మార్కెట్ యార్డ్ లోకి రావడం వల్ల మార్కెట్ యార్డ్ ప్రాంతమంతా బురదమయం కావడంతోపాటు, మార్కెట్ యార్డులోని దుకాణాలకు వెళ్లేందుకు దారి కూడా లేకుండా పోవటంతో రైతులుకు ఇబ్బందులు లేకుండా ఉండాలని ఉద్దేశంతో డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించడంతో పాటు డ్రైనేజీల శుభ్రపరచడం, పిచ్చి మొక్కల తొలగింపు, చెత్త సేకరణ వంటి పనులను వేగవంతంగా చేపిస్తున్నామని ఆయన అన్నారు . మార్కెట్ యార్డ్ ను పరిశుభ్రంగా ఉంచటం తో పాటు ఆదర్శంగా నిలుపుతానని ఆయన అన్నారు . ఈ కార్యక్రమంలో సంజయ్ నగర్ సర్పంచ్ తాటి బాలకృష్ణ, గ్రామ కార్యదర్శి వెంకటేశ్వర్లు, మార్కెట్ కార్యదర్శి, ఏఎంసీ సిబ్బంది పాల్గొన్నారు

## రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బదనకల్ కి చెందిన వృద్ధురాలు గుడ్ల సత్తవ్వ (70) చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈనెల 7 తారీఖున సాయంత్రం ముస్తాబాద్ శివారులలో తన మనువరాలు అయిన నవ్యతో కలిసి బదనకల్ నుండి ముస్తాబాద్ వస్తుండగా ముస్తాబాద్ శివారులలో యూటర్న్ వద్ద అకస్మాత్తుగా కుక్కలు వారు వెళ్లే ఎలక్ట్రిక్ స్కూటీ కి అడ్డం రావడంతో వారు నడుపుతున్న ఎలక్ట్రిక్ స్కూటీ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయారు. ఈ ప్రమాదంలో గుడ్ల సత్తవ్వ తలకి తీవ్ర గాయాలు కాగా, బండి నడుపుతున్న గుడ్ల నవ్య కి కూడా గాయాలయ్యాయి. వారిని హుటాహుటిన 108 లో ముస్తాబాద్ హాస్పిటల్ తరలించగా, మెరుగైన వైద్య సేవల కోసం వారిని హైదరాబాద్ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ల సలహా మేరకు సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం ఉదయం పరిస్థితి విషమించి గుడ్ల సత్తవ్వ మృతి చెందినట్లు ముస్తాబాద్ ఎస్సై జ్యోతి తెలిపారు.

## క్షేత్ర స్థాయి వాస్తవాల ఆధారంగానే ఎల్ నినో ఎదుర్కొనాలి



* **డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క మల్లు.**

ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : సోమవారం ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క మల్లు, రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్, ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారి అనుదీప్ దురిశెట్టి, ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్., భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు లతో కలిసి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎల్‌నినో పరిస్థితులు, వర్షపాతం, త్రాగునీటి లభ్యత, సాగునీటి పరిస్థితి, భూగర్భ జలాలు, విద్యుత్ సరఫరా, పంటల ప్రణాళికలపై సంబంధిత శాఖల అధికారులతో ఉప ముఖ్యమంత్రి సమగ్ర సమీక్ష నిర్వహించారు.

# ప్రమాదకరంగా ఉన్న ధర్మారెడ్డిపల్లి కాలువ కల్వర్టుపై సైడ్ గోడలను నిర్మించాలి

*** సిపిఎం డిమాండ్**

వలిగొండ, ప్రజాస్ఫూర్తి : వలిగొండ చౌటుప్పల్ మెయిన్ రోడ్డు కు కింది నుండి వెళ్తున్న జాలు కాలువ పరిధిలోని ప్రమాదకరంగా ఉన్న ధర్మారెడ్డిపల్లి కాలువ కల్వర్టుపై సైడ్ గోడలను నిర్మించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు మద్దెల రాజయ్య,సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి లు డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని జాలు కాలువ గ్రామ శివారులో గోకారం నుండి వెల్లంకి కి వెళ్లే ధర్మారెడ్డిపల్లి కాలువ ప్రమాదకర కల్వర్టు ను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ధర్మారెడ్డి పల్లి కాలువ కాంట్రాక్టర్ కాల్వకు మరమ్మత్తులు చేసే భాగంగా కల్వర్టుకు ఇరువైపులా గోడలను నిర్మించకుండా పోసిన మట్టి మొత్తం కాల్వలోకి కొట్టుకుపోయి గుంతలు ఏర్పడ్డాయని, దీనితో మూలమలుపు కావడం వల్ల అనేక మంది ప్రయాణికులు రాత్రి సమయాల్లో దానిలో పడిపోయిన పరిస్థితులు ఉన్నాయని ఎలాంటి ప్రాణహాని జరగకముందే కాంట్రాక్టర్ ఇప్పటికైనా స్పందించి ప్రమాదకరంగా ఉన్న కల్వర్టుకు ఇరువైపులా సైడ్ గోడలను నిర్మించాలని డిమాండ్ చేశారు. ఇరిగేషన్ శాఖ అధికారులు కనీస పర్యవేక్షణ లేకుండా కాల్వ మరమ్మత్తు పనుల విషయంలో ఉదాసీనంగా వ్యవహరించడం వల్ల ఈ రకంగా నాసిరకమైన పనులు జరుగుతున్నాయని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఇరిగేషన్ శాఖ అధికారులపై జిల్లా కలెక్టర్ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



ఈ గుంతలు నిత్యం చౌటుప్పల్ వలిగొండ కు ప్రయాణం చేస్తున్న అనేకమంది ప్రయాణికులకు శాపంగా మారాయని వీటిలో పడితే మనుషుల ప్రాణాలు పోతాయని మనుషుల ప్రాణాలు పోతే మాత్రమే అధికారులు స్పందిస్తారా అని వారు ప్రశ్నించారు. వెంటనే అధికారులు ఇట్టి స్థలాన్ని పరిశీలించి గోడలను నిర్మాణం చేయించాలని లేనిపక్షంలో ఆ స్థలం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గోకారం మాజీ సర్పంచ్ సిర్పంగి శ్రీరాములు, మండల కమిటీ సభ్యులు కవిడే సురేష్,నాయకులు మద్దెల మారయ్య,రాపోతు వెంకులు, ఇంద్రారెడ్డి,చేగూరి నగేష్, గంగాపురం వెంకటేశం, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌నీనో ప్రభావంపై ముందస్తు చర్యలు

*** అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలి: కలెక్టర్ కె. హరిత**



కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా, ప్రజా స్ఫూర్తి:ఎల్‌నీనో ప్రభావంతో ఏర్పడే పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తూ ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులకు సూచించారు. ప్రజల్లో అవగాహన పెంచడంలో మీడియా కీలక పాత్ర పోషించాలని, ప్రభుత్వ సూచనలు ప్రతి గ్రామానికి చేరేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆమె కోరారు.సోమవారం ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల స్పెషల్ ఆఫీసర్ ఇలంబర్తి అధ్యక్షతన నిర్వహించిన ఎల్‌నీనో ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళిక సమీక్షా సమావేశంలో కలెక్టర్ హరిత మాట్లాడారు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తే వర్షాభావ పరిస్థితులు, తాగునీటి సమస్యలు, వ్యవసాయంపై పడే ప్రభావాన్ని గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. సమావేశంలో వ్యవసాయం, ఉద్యానవనం, నీటిపారుదల, భూగర్భ జలాలు, విద్యుత్, పశుసంవర్ధక, వైద్య ఆరోగ్యం, అటవీ, పంచాయతీరాజ్, పురపాలక, మహిళా శిశు సంక్షేమ తదితర శాఖల అధికారులు తమ కార్యాచరణ ప్రణాళికలను వివరించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మందమకరందు, ఉమ్మడి జిల్లాల అదనపు కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ఆధ్వర్యంలో సర్పంచ్ జువ్వి నర్సింహ్మాకు ఘన సన్మానం



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండలం ధర్మోజి గూడెం గ్రామ సర్పంచ్ జువ్వి నర్సింహ్మాను గ్రామ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. పాల ఉత్పత్తిదారుల సంఘం తరపున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం డైరెక్టర్ గా సేవలు అందించిన జువ్వి నర్సింహ్మా సర్పంచ్ గా గెలవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం సర్పంచ్ జువ్వి నర్సింహ్మా పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ గా రెండోసారి ఎన్నికైన రాచకొండ కృష్ణయ్యను ఘనంగా సత్కరించారు. శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్ లు సామిడి అంజిరెడ్డి, సామిడి లింగారెడ్డి, ఊదరి ఎల్లయ్య, కొంతం సుశీలఎల్లారెడ్డి, జంగం అంజయ్య, బద్రి బుచ్చయ్య, జక్కలి మల్లయ్య, కార్యదర్శి చెరుకు మహేందర్ గౌడ్, రాచకొండ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్య నేర్చుకున్న పాఠశాలను సందర్శించిన కార్పొరేటర్ ఎరబ్రెల్లి శంకర్



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: కొత్తగూడెం మున్సిపాలిటీ 16వ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ హైస్కూల్‌ను స్థానిక కార్పొరేటర్ ఎరబ్రెల్లి శంకర్ సోమవారం సందర్శించారు. తాను 1995-96 విద్యా సంవత్సరంలో ఇదే పాఠశాలలో 10వ తరగతి చదివానని, తిరిగి ఈ పాఠశాలను కార్పొరేటర్‌గా సందర్శించడం ఎంతో గర్వంగా ఉందని చెప్పారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనం ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం అందిస్తున్నారా అనే విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. పాఠశాలలో ఉన్న సమస్యలను ప్రధానోపాధ్యాయులు భరత్ కుమార్ కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాల ప్రాంగణంలో శిథిలావస్థలో ఉన్న భవనాలను తొలగించి వాటి స్థానంలో కొత్త భవనాల నిర్మాణం చేపట్టేందుకు సంబంధిత అధికారులకు లిఖితపూర్వకంగా వినతిపత్రం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మొక్కలు నాటిన రోటరిక్లబ్ ఆఫ్ మహబూబాబాద్




మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : ప్రపంచం పర్యావరణ పరిరక్షణలో భాగంగా మహబూబాబాద్ రోటరిక్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. అధ్యక్షులు దూదికట్ల సత్యం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి శంతన్ రామరాజు, కోశాధికారి ముల్లంగి మోహన్ రెడ్డి లు పాల్గొన్నారు.ఈసందర్భంగా అధ్యక్షులు దూదికట్ల సత్యం మాట్లాడుతూ పుడమితల్లికి పచ్చటి పందిరి వెయ్యాలనే లక్ష్యంతో సోమవారం వంద మొక్కలకు పైగా నాటామన్నారు. రోటరీ ఇంటర్నేషనల్ షెడ్యూల్ ప్రకారం ఈ కార్యక్రమాన్ని చేపట్టామని పేర్కొన్నారు. అడవుల నరికివేతతో పర్యావరణ సమతుల్యం దెబ్బతినతోందని వాపోయారు. ప్రపంచం వ్యాప్తంగా వాతావరణంలో తీవ్ర అసంబద్ధ మార్పులు వచ్చాయన్నారు..ఈ కార్యక్రమంలో డిస్టిక్ట్ లీడర్ బిక్కి వెంకటేశ్వర్లు, సీనియర్ రొటేరియన్లు బొల్లం శ్రీనివాస్, బోనగిరి గిరిధర్ గుప్తా,సాధు మహిపాల్ రెడ్డి,అచ్చ శ్రీనివాస్,జిల్లా పదోతరగతి ఎక్సమినేషన్ ఆఫీసర్ మందుల శ్రీరాములు,మోడల్ స్కూల్ ఇంచార్జి ప్రిన్సిపల్ నాగేశ్వరావు ఉపాధ్యాయిని కీర్తన, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ మహిళా సంఘం అధ్యక్షురాలిగా

# మిట్టపల్లి శ్రీదేవి ప్రమాణ స్వీకారం



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: సూర్యాపేట పట్టణ ఆర్య సంఘం మహిళా అధ్యక్షురాలుగా మహిళల సాధికారత కోసం తనవంతు కృషి చేస్తానని, ఆర్యవైశ్య మహిళలకు మన సంస్కృతి సాంప్రదాయాలు, పురాణ ఇతిహాసాలు పట్ల అవగాహన కల్పించే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తానని పట్టణ ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు మిట్టపల్లి శ్రీదేవి అన్నారు. సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలిగా మిట్టపల్లి శ్రీదేవి ప్రమాణ స్వీకారం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు రాయపూడి భవాని ప్రమాణ స్వీకారం చేయించారు. గౌరవ అధ్యక్షురాలుగా బ్రాహ్మడ్లపల్లి తరంగిణి, వర్కింగ్ ప్రెసిడెంట్ బెలిదే రాధ, సెక్రటరీ లకుమారపు పద్మజ, ట్రెజరర్ ఓరుగంటి లావణ్య , ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు, కార్యవర్గ సభ్యురాలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మిట్టపల్లి శ్రీదేవి మాట్లాడుతూ మహిళలు తన పిల్లల్ని తన కుటుంబాన్ని చూసుకోవడమే కాకుండా వారికి బంగారు భవిష్యత్తు నిర్మాణం చేస్తారని అటువంటివారు సామాజిక కార్యక్రమాలలో కూడా చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆర్యవైశ్య మహిళలకు పేదవారికి కుట్టు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని, సంఘం నిర్వహించే కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందిస్తామని అన్నారు. ఈ రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ, ఊరే లక్ష్మణ్, పట్టణ అధ్యక్షులు బెలిదె శ్రీనివాసులు, కర్నాటి కిషన్ జిల్లా అధ్యక్షులు వెంపటి వెంకటేశ్వర రావు, ,చల్లా లక్ష్మీకాంత్, ఇమ్మడి సోమనరసయ్య, బండారు రాజా, మిట్టపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు

# ఒక గంట 15 నిమిషాల్లో 50 చిత్రాలు

*** 'విశ్వగురు వరల్డ్ రికార్డు' సాధించిన బాలుడు వేదార్త్**



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : చిత్రలేఖనంలో ఐదున్నరేళ్ల మాస్టర్ వేదార్త్ అరుదైన ఘనత సాధించాడు. కేవలం గంటా 15 నిమిషాల్లో "ఏనుగు" థీమ్‌పై 50 చిత్రాలు గీసి విశ్వగురు వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించారు. నిజాంపేట్ కు చెందిన డాక్టర్ ఉప్పల మణికంఠ, డాక్టర్ శ్రీలత దంపతుల కుమారుడైన వేదార్త్ నిజాంపేట్‌లోని కేపీఆర్ దివ్య ప్రభాస్ ఎన్‌క్లేవ్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో తన అసాధారణ ప్రతిభను ప్రదర్శించారు. సద్గురు ది స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ విద్యార్థి అయిన వేదార్త్ ప్రత్యక్షంగా 50 విభిన్న ఏనుగు చిత్రాలను గీసి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. వేదార్త్ ప్రతిభను పరిశీలించిన విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధులు, ఈ ఘనతను అధికారికంగా "విశ్వగురు వరల్డ్ రికార్డు" గా నమోదు చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి లక్ష్మీకాంతం మాట్లాడుతూ వేదార్త్ గీసిన ప్రతి చిత్రంలో భావవ్యక్తీకరణ అద్భుతంగా ఉందని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ వ్యవస్థాపకుడు, సీఈఓ డాక్టర్ సత్యవోలు రాంబాబు, డాక్టర్ సారంగపాణి, ప్రముఖ చిత్రకారుడు సురేష్, ప్రముఖ వాస్తు నిపుణుడు, ఈనాడు కాలమిస్ట్ కృష్ణాది శేషు, హైకోర్టు న్యాయవాది సీహెచ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. వేదికపై వేదార్త్ ఏకాగ్రతతో వరుసగా 50 చిత్రాలను గీయడం అతిథులు, కళాభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. చిన్న వయసులోనే అసాధారణ ప్రతిభ కనబరిచిన వేదార్త్ ను అతిథులు అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## జర్నలిస్టులకు అండగా

# జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : జర్నలిస్ట్ సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ అన్నారు.మహబూబాబాద్ జిల్లా, గూడూరు మండలం,మచ్చర్ల గ్రామంలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ ను వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూ జే ఐ) జర్నలిస్ట్ యూనియన్ నూతన ఆడహాక్ కమిటీ కన్వీనర్ హనుమండ్ల రామకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో జాటోత్ హుస్సేన్ నాయక్ ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు,ముఖ్యంగా ఇళ్ల స్థలాల కేటాయింపు,సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలను జాటోత్ హుస్సేన్ నాయక్ దృష్టికి రామకృష్ణారెడ్డి తీసుకెళ్లారు.జర్నలిస్ట్ సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని జాటోత్ హుస్సేన్ నాయక్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సంఘటన కార్యదర్శి అంబాల కుమారస్వామి, సంయుక్త కన్వీనర్ పల్లె శ్రీనివాస్,కోకన్వీనర్లు కొండి సాయి కిరణ్, తక్కెళ్లపల్లి శ్రీనివాస్, శివరామకృష్ణ పాల్గొన్నారు.

## తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ స్కూల్ & జూనియర్ కళాశాలను సందర్శించిన

*** జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి పి. దేవి మానస**




ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ స్కూల్ & జూనియర్ కళాశాలను జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి పి. దేవి మానస సందర్శించి విద్యార్థినులకు న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా న్యాయ సేవా సంస్థల చట్టం సైబర్ నేరాలకు సంబంధించిన చట్టాలు,పిల్లల హక్కులు , బాలల రక్షణకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు. ఆర్ట్స్ విద్య యొక్క ప్రాముఖ్యతను వివరించి, చరిత్ర, రాజకీయ శాస్త్రం, ఆర్థిక శాస్త్రం వంటి అంశాలు పరిపాలన, న్యాయశాఖ, సివిల్ సర్వీసులు, బోధన, జర్నలిజం తదితర రంగాల్లో ఉన్నత అవకాశాలకు పునాది అని తెలిపారు. విద్యార్థినులతో ప్రత్యక్షంగా ముచ్చటించి వారి సందేహాలను నివృత్తి చేశారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో చదివి భవిష్యత్తులో దేశానికి ఉపయోగపడే అధికారులు, న్యాయవాదులు, ఉపాధ్యాయులు, ప్రజా సేవకులుగా ఎదగాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు , విద్యార్థినులు పాల్గొన్నారు.

## హుస్నాబాద్ బీజేపీ మండల కమిటీ ప్రకటింపు

*** బిజెపి హుస్నాబాద్ మండల అధ్యక్షులు భూక్య సంపత్ నాయక్**



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : బీజేపీ హుస్నాబాద్ మండల పార్టీ నూతన కార్యవర్గంతో పాటు వివిధ మోర్చాల మండల అధ్యక్షులను మండల అధ్యక్షుడు భూక్య సంపత్ నాయక్ శనివారం ప్రకటించారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆశీస్సులు, బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ఆదేశాల మేరకు, జాతీయ, రాష్ట్ర పార్టీ మార్గదర్శకాల ప్రకారం నియమించామని తెలిపారు.నూతన మండల కమిటీలో ఉపాధ్యక్షులుగా భూతగడ్డ బాలరాజు, రాగుల చంద్రశేఖర్ రెడ్డి, కుంట మల్లయ్య, బత్తుల శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శులుగా తడిసిన రమేష్ రెడ్డి, భైరి అరుణ్, కార్యదర్శులుగా బాలగోని మల్లేష్, నార్లపురం సత్యం, తాళ్లపల్లి చంద్రం, బాషవేణి వెంకటేష్, కోశాధికారిగా కనకంట్ల కిషన్‌ను నియమించారు. ఈ సందర్భంగా మండల కమిటీ ఏర్పాటుకు సహకరించిన బీజేపీ రాష్ట్ర నాయకులు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్ రావు, అసెంబ్లీ కన్వీనర్ గుర్రాల లక్ష్మారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మం వెంకటేశం, జిల్లా ఉపాధ్యక్షుడు మాచర్ల కుమార్, జిల్లా కార్యదర్శి పైడిపల్లి పృథ్వీరాజ్‌కు మండల అధ్యక్షుడు భూక్య సంపత్ నాయక్ కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా నియమితులైన నాయకులు పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు హుస్నాబాద్ మండలంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సమష్టిగా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ నియామకాలు నేటి నుంచే అమల్లోకి వస్తాయని మండల అధ్యక్షుడు వెల్లడించారు.

## గణపురంలో భారీగా పీడీఎస్ బియ్యం పట్టివేత

*** 169.4 క్వింటాళ్లు స్వాధీనం.. ఇద్దరు అదుపులో**



జయశంకర్ భూపాలపల్లి, ప్రజాస్ఫూర్తి : జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలో అక్రమంగా నిల్వ ఉంచిన 169.4 క్వింటాళ్ల ప్రజాపంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యాన్ని అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్స్, పోలీసు, సివిల్ సప్లై, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా నిర్వహించిన ఆకస్మిక దాడుల్లో ఈ భారీ బియ్యం నిల్వ బయటపడింది. టాస్క్ ఫోర్స్ అదనపు ఎస్పీ ప్రభాకర్ ఆధ్వర్యంలో గణపురం ఎస్ఐ బొరగల అశోక్, సివిల్ సప్లై, రెవెన్యూ శాఖల అధికారులు పక్కా సమాచారంతో దాడులు నిర్వహించారు. ఒకే చోట అక్రమంగా నిల్వ చేసిన 169.4 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, ఈ వ్యవహారానికి సంబంధించిన మోటం సారంగపాణి, తూర్పాటి వెంకటేశ్లను అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని తదుపరి చర్యల నిమిత్తం గణపురం మండల కేంద్రంలోని లక్ష్మీ గణపతి రైస్ మిల్లుకు తరలించారు. నిందితులపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు చేరాల్సిన పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసి తరలించే వారిపై కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. ఈ దాడితో అక్రమ బియ్యం రవాణా, నిల్వలపై అధికారుల నిఘా మరింత కట్టుదిట్టమైందని స్థానికంగా చర్చ జరుగుతోంది.

## ఘనంగా మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ జన్మదిన వేడుకలు



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు ఉప్పు కృష్ణ ఆధ్వర్యంలో చౌటుప్పల్ లో సోమవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని దండు మల్కాపురం పరిధిలోని శ్రీ ఆందోల్ మైసమ్మ దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దగోని ప్రసాద్ గౌడ్, తూర్పుంటి గణేష్, పల్చం శ్రీకాంత్ గౌడ్, చేవెల్లి సాయి, ఊదరి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# సరిహద్దు ప్రాంతాల్లో నేరాల నియంత్రణకు సమన్వయమే కీలకం

* **గోల్కొండ రిసార్ట్‌లో సైబరాబాద్ పోలీసుల బోర్డర్ క్రైమ్ కోఆర్డినేషన్ సమావేశం**



సైబరాబాద్, ప్రజాస్ఫూర్తి: సరిహద్దు ప్రాంతాల్లో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, పోలీసు శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో గోల్కొండ రిసార్ట్‌లో బోర్డర్ క్రైమ్ కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, ఐపీఎస్ అధ్యక్షత వహించగా, హైదరాబాద్, ఫ్యూచర్ సిటీ, సంగారెడ్డి, మెదక్ తదితర సరిహద్దు కమిషనరేట్లు, జిల్లాల పోలీసు అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీపీ డా. ఎం. రమేష్ మాట్లాడుతూ సరిహద్దు ప్రాంతాల్లో నేరాలను అరికట్టడంలో పోలీసు శాఖల మధ్య సమన్వయం, వేగవంతమైన సమాచార మార్పిడి, సంయుక్త కార్యాచరణ అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఒక ప్రాంతంలో నేరానికి పాల్పడి మరో ప్రాంతానికి పారిపోయే నేరస్థులను గుర్తించి త్వరితగతిన పట్టుకునేందుకు పరస్పర సహకారం అవసరమని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం, సీసీటీవీ నెట్‌వర్క్, ఇంటెలిజెన్స్ సమాచారాన్ని సమర్థవంతంగా వినియోగించి నేరాల నియంత్రణలో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. రౌడీ షీటర్లు, చరిత్ర కలిగిన నేరస్తులు, అంతర్‌రాష్ట్ర ముఠాలు, సైబర్ నేరస్థుల కదలికలపై నిరంతర నిఘా కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో లా అండ్ ఆర్డర్, క్రైమ్, ట్రాఫిక్, స్పెషల్ ఆపరేషన్స్ టీమ్ (ఎస్‌వోటీ), స్పెషల్ బ్రాంచ్, సైబర్ క్రైమ్ విభాగాల పనితీరును సమీక్షించారు. ఆయా విభాగాల అధికారులు తమ పరిధిలోని పరిస్థితులు, సవాళ్లు, నేరాల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలు, సమన్వయ వ్యూహాలపై ప్రజెంటేషన్లు ఇచ్చారు. రౌడీ షీటర్లు, అంతర్‌రాష్ట్ర ముఠాలపై సమాచార మార్పిడి, సంయుక్త చెక్‌పోస్టులు, పెట్రోలింగ్, వాట్సాప్ గ్రూపుల ద్వారా తక్షణ సమాచార వినిమయం, మిస్సింగ్ వ్యక్తులు, గుర్తుతెలియని మృతదేహాల వివరాల భాగస్వామ్యం, సీసీటీవీ కవరేజ్ విస్తరణ, సైబర్ నేరాల నియంత్రణ, వీఐపీ బందోబస్తు, మతపరమైన పండుగలు, భారీ కార్యక్రమాల సందర్భంగా ట్రాఫిక్ నిర్వహణ, సామాజిక ఉద్రిక్తతల నివారణ, సహజ విపత్తుల సమయంలో సంయుక్త చర్యలు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో జాయింట్ సీపీ (ట్రాఫిక్) సన్‌ప్రీత్ సింగ్, హైదరాబాద్ జాయింట్ సీపీ (ట్రాఫిక్) జోయెల్ డావిస్, కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, కుత్బుల్లాపూర్ డీసీపీ ఎన్. కోటి రెడ్డి, శేరిలింగంపల్లి డీసీపీ సి.హెచ్. శ్రీనివాస్, ట్రాఫిక్ డీసీపీ ఐ. శేషాద్రిని రెడ్డి, డీసీపీ (క్రైమ్స్) ముత్యం రెడ్డి, డీసీపీ (స్పెషల్ బ్రాంచ్) వై.వి.ఎస్. సుధీంద్ర, డీసీపీ (మహిళా, శిశు భద్రత) సృజన కరణం, డీసీపీ (సైబర్ క్రైమ్స్) పుష్పతో పాటు వివిధ కమిషనరేట్లు, జిల్లాల పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# చెస్‌తో మేధో వికాసం

* **అంతర్జాతీయ చెస్ డే సందర్భంగా జిల్లా చెస్ అసోసియేషన్ వేడుకలు**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, (ప్రజా స్ఫూర్తి): అంతర్జాతీయ చెస్ డే సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం చెస్ పోటీలు, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు రవి పటేల్, గౌరవాధ్యక్షుడు పంతకాని సమ్మయ్య మాట్లాడుతూ చెస్ క్రీడ ఏకాగ్రత, మేధోసంపత్తి, విశ్లేషణాత్మక ఆలోచన, నిర్ణయ సామర్థ్యాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. విద్యార్థులు, యువత చెస్‌ను అలవర్చుకోవడం ద్వారా మానసిక వికాసంతో పాటు క్రమశిక్షణ, ఓర్పు వంటి విలువలు కూడా పెంపొందుతాయని పేర్కొన్నారు. జిల్లాలో త్వరలోనే భారీ స్థాయిలో మెగా ఓపెన్ చెస్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు వెల్లడించారు. జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల క్రీడాకారులకు కూడా అవకాశం కల్పించి చెస్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు అసిఫ్, రాం నారాయణ, సుమన్, దేవేందర్, శ్రీరాములు, కిరణ్, సంతోష్, శంకరయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# బోర్ వెల్ పనులను ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్



వికారాబాద్, ప్రజాస్ఫూర్తి : ప్రజల దాహార్తిని తీర్చేందుకు వార్డ్ నెం. 10 అనంతగిరిపల్లి లో కొత్త బోరు పనులను సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం అనన్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలో బోరు పూర్తయి వార్డ్ ప్రజలకు తాగునీటి సమస్య తీరనుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అర్థ సుధాకర్ రెడ్డి , కౌన్సిలర్ వినోద్ కుమార్ , మున్సిపాలిటీ.డీఈ కొండలరావు, టౌన్ వైస్ ప్రెసిడెంట్ రెడ్యా నాయక్ భాగయ్య, రెడ్డి శేఖర్ బాలరాజు , పాల రాము , శీను , పరశురాం, నరసింహులు,కురువ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్త జీవితానికి బాటలు వేద్దాం...

* **మద్యం బానిసత్వం నుంచి విముక్తికి ఆల్కహాలిక్స్ అనానిమస్ చేయూత**
* **ఉచిత సేవలు.. గోప్యతకు భరోసా...**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి: "ఒక్క గ్లాసుతో మొదలైన అలవాటు... చివరికి కుటుంబాన్ని, ఆరోగ్యాన్ని, గౌరవాన్ని, జీవితాన్నే కోల్పోయే స్థితికి తీసుకెళ్తుంది." మద్యం బానిసత్వం ఎంత ప్రమాదకరమో అనుభవించినవారే దాని బాధను పూర్తిగా అర్థం చేసుకోగలరు. అయితే ఆ చీకటి జీవితానికి ముగింపు పలికి, కొత్త ఆశతో ముందుకు సాగేందుకు ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందికి ఆల్కహాలిక్స్ అనానిమస్ (Alcoholics Anonymous - AA) ఒక భరోసాగా నిలుస్తోంది. ప్రస్తుతం ప్రపంచంలోని 190కు పైగా దేశాల్లో లక్షలాది మంది మద్యానికి పూర్తిగా దూరంగా ప్రశాంతమైన జీవితాన్ని గడపడానికి ఈ సంస్థ మార్గనిర్దేశం చేస్తోంది. మద్యం బానిసత్వాన్ని ఒక వ్యాధిగా గుర్తిస్తూ, దానికి మందుల కంటే మానసిక పరివర్తన, పరస్పర సహకారం, ఆత్మవిశ్వాసమే శాశ్వత పరిష్కారమని ఏఏ కార్యక్రమం విశ్వసిస్తోంది.

**"తాగుడు నియంత్రణలో ఉండదు"**

తాగుడు బానిసత్వానికి గురైన వ్యక్తి మద్యాన్ని "అప్పుడప్పుడు", "కొద్దిగా" మాత్రమే తాగడం సాధ్యం కాదని ఏఏ సభ్యులు పేర్కొంటున్నారు. అందుకే మద్యానికి పూర్తిగా దూరంగా ఉండడమే శాశ్వత పరిష్కారమని వారు సూచిస్తున్నారు. తాగుడు వల్ల శారీరక ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు, ఉద్యోగ నష్టం, మానసిక ఒత్తిడి, సమాజంలో గౌరవం కోల్పోవడం వంటి అనేక సమస్యలు వెంటాడుతాయి. చాలామంది మానేయాలని ప్రయత్నించినా మళ్లీ అదే అలవాటుకు బానిసలవుతుంటారు.

* **మద్యం మానేసిన వారే... మరొకరికి మార్గదర్శకులు**

ఆల్కహాలిక్స్ అనానిమస్ ప్రత్యేకత ఏమిటంటే... ఒకప్పుడు తాగుడు బానిసలుగా ఉన్నవారే నేడు ఇతరులకు దారి చూపుతున్నారు. తాము ఎదుర్కొన్న కష్టాలు, కుటుంబం అనుభవించిన బాధలు, అనంతరం ఏఏ ద్వారా తమ జీవితంలో వచ్చిన మార్పును సమావేశాల్లో పంచుకుంటూ కొత్తగా వచ్చే వారికి ధైర్యాన్ని నూరిపోస్తున్నారు. ఇక్కడ ఎవరూ ఎవరినీ విమర్శించరు. ఎవరినీ చిన్నచూపు చూడరు. ప్రతి ఒక్కరి అనుభవాన్ని గౌరవిస్తారు. అదే ఈ సంస్థ విజయానికి ప్రధాన కారణంగా నిలుస్తోంది.

**ఎలాంటి ఫీజు లేదు... సేవే లక్ష్యం**

ఆల్కహాలిక్స్ అనానిమస్ పూర్తిగా స్వచ్ఛంద సేవా సంస్థ. సభ్యుల నుంచి ఎలాంటి ఫీజులు లేదా విరాళాలు వసూలు చేయరు. సేవాభావం, సమాజ సంక్షేమమే ఈ కార్యక్రమం లక్ష్యం. సమావేశాలకు వచ్చే వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతారు. వారి వ్యక్తిగత గౌరవానికి ఎలాంటి భంగం కలగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటారు.

* **1935లో అమెరికాలో ప్రారంభమైన ఉద్యమం... నేడు ప్రపంచవ్యాప్త సేవ**

1935లో అమెరికాలో ఒక స్టాక్ బ్రోకర్, ఒక శస్త్రచికిత్స నిపుణుడు మద్యం బానిసత్వం నుంచి బయటపడి, తమలాంటి వారిని ఆదుకోవాలనే సంకల్పంతో ఆల్కహాలిక్స్ అనానిమస్ సంస్థను ప్రారంభించారు. అనంతరం ఈ ఉద్యమం ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. భారతదేశంలో 1957లో ముంబైలో తొలిసారిగా ప్రారంభమైన ఈ సంస్థ ప్రస్తుతం దేశవ్యాప్తంగా మద్యం బానిసత్వం నుంచి విముక్తి కల్పించే కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

* **వరంగల్ నుంచి భూపాలపల్లి వరకు సేవలు**

తెలంగాణలో కాకతీయ డిస్ట్రిక్ట్ కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ కేంద్రంగా ఆల్కహాలిక్స్ అనానిమస్ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కూడా మద్యం బానిసత్వంపై అవగాహన కల్పిస్తూ, సమావేశాలు నిర్వహిస్తూ మార్పు కోసం కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా భూపాలపల్లిలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల గురించి ప్రజా స్ఫూర్తి ప్రతినిధికి సభ్యులు తమ విధి విధానాలను వివరించారు. సమావేశాల్లో పాల్గొనే వారు తమ అనుభవాలను పంచుకుంటూ, కొత్తగా వచ్చే వ్యక్తుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి మద్యానికి శాశ్వతంగా దూరమయ్యేలా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.

**భూపాలపల్లిలో ఉచిత సహాయం**

కాకతీయ డిస్ట్రిక్ట్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, భూపాలపల్లి జిల్లాలో మద్యం బానిసత్వాన్ని తగ్గించేందుకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మద్యం మానేయాలని నిజంగా సంకల్పించిన వారు భూపాలపల్లి జడ్పీహెచ్ఎస్ లో జరిగే ఏఏ సమావేశాలకు హాజరుకావాలని సూచించారు.

**సహాయం కోసం సంప్రదించండి**

కాకతీయ డిస్ట్రిక్ట్ కమిటీ (తెలంగాణ రూరల్ సర్వీస్ కమిటీ):

* **63095 50012 (టోల్ ఫ్రీ/సహాయ నంబర్)**
* **భూపాలపల్లి ఏఏ గ్రూప్:**
* **76749 59008**
* **81850 32170**

# ఎస్ఐఆర్ తో ప్రజాస్వామ్యం పై దాడి

: **2029ఎన్నికలే లక్ష్యం గా బిజెపి ఎస్ఐఆర్ ప్రయోగం**

- **సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బి.వి. రాఘవులు**




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ను ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే ప్రక్రియగా కాకుండా, రాబోయే ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనాలు పొందేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వినియోగించుకుంటోందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బి.వి. రాఘవులు ఆరోపించారు. చౌటుప్పల్‌లోని పద్మావతి ఫంక్షన్ హాల్‌లో సీపీఐ(ఎం ) ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రాంతీయ సదస్సులో ముఖ్య వక్తగా పాల్గొన్న రాఘవులు, ఎస్ఐఆర్‌పై విస్తృతంగా మాట్లాడారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ రాజ్యాంగబద్ధమైన ప్రక్రియేనని, అయితే గతంలో జరిగినప్పుడు ఇంత తీవ్ర రాజకీయ చర్చలు, ప్రజల్లో ఆందోళనలు కనిపించలేదని రాఘవులు అన్నారు. తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల్లో చివరిసారిగా 2002లో సమగ్ర సవరణ జరిగిందని, పదేళ్లకోసారి జరగాల్సిన ప్రక్రియ ఆలస్యంగా ఇప్పుడు చేపట్టడం వెనుక రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయన్నారు. ఎస్ఐఆర్ ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం లక్ష్యమైతే తమ పార్టీ కూడా పూర్తిగా మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. అయితే ప్రస్తుతం చేపడుతున్న ప్రక్రియ వెనుక ప్రజాస్వామ్య పరిరక్షణ కంటే 2029ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రాజకీయ లాభం పొందాలనే ఉద్దేశం ఉందని ఆరోపించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ముస్లింలు, ఇతర మైనారిటీలు, దళితులు, గిరిజనులు, వలస కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు, పేద వర్గాలు, కొన్ని వెనుకబడిన వర్గాలలో పడని ఓట్లు లక్ష్యంగా ఎస్ ఐ ఆర్ ను కేంద్రం ఉపయోగించుకుందని విమర్శించారు. నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియను కూడా ఎన్నికల లబ్ధికి అనుకూలంగా వినియోగించే ప్రయత్నం జరుగుతోందని రాఘవులు ఆరోపించారు. బీజేపీకి అనుకూల ప్రాంతాలను ఒకే నియోజకవర్గంగా మార్చడం, ప్రతిపక్షాలకు బలం ఉన్న ప్రాంతాలను విభజించడం ద్వారా ఎన్నికల సమీకరణాలను మార్చే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. దక్షిణాది రాష్ట్రాలకు డీలిమిటేషన్ వల్ల ప్రాతినిధ్యం తగ్గే ప్రమాదం ఉందని, దీనిపై అన్ని రాజకీయ పార్టీలు కలిసి పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎం డి పాషా అధ్యక్షత వహించిన ఈ సెమినార్ లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండి జహంగీర్, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ళ ఆశయ్య, కొండమడుగు నరసింహ, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు గౌడ్, కల్లూరి మల్లేశం, బూరుగు కృష్ణారెడ్డి, జల్లెల పెంటయ్య, గుంటోజు శ్రీనివాసచారి, మండల కార్యదర్శి గంగాదేవి సైదులు, జిల్లా కమిటీ సభ్యులు రాయగిరి కిష్టయ్య, సిరిపంగి స్వామి ,అవ్వారు రామేశ్వరి, బొడ్డుపల్లి వెంకటేష్ ,మద్దెల రాజయ్య, దూడ యాదిరెడ్డి ,కోట రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ



వికారాబాద్, ప్రజాస్ఫూర్తి : ఈ నెల 21న వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల , హకీంపేట్ ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ హబ్ పనులతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పరిశీలించనున్న నేపథ్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, తో కలిసి జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ కలిసి ముఖ్యమంత్రి పర్యటన మార్గం, హెలిప్యాడ్, ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ హబ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తదితర ప్రాంతాలను సందర్శించి, సంబంధిత శాఖల అధికారులతో భద్రతా, ట్రాఫిక్, పార్కింగ్, ఇతర ఏర్పాట్లపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, పోలీసు అధికారులకు పలు కీలక సూచనలు చేస్తూ, ముఖ్యమంత్రి పర్యటన అత్యంత ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమమని పేర్కొన్నారు. బందోబస్తును ఎలాంటి లోపాలకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని, హెలిప్యాడ్ నుంచి కార్యక్రమ ప్రాంగణాల వరకు ప్రతి ప్రాంతంలో కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని ఆదేశించారు. అలాగే ట్రాఫిక్ నియంత్రణ, యాంటీ సాబోటాజ్ తనిఖీలు, యాక్సెస్ కంట్రోల్, బారికేడింగ్, పార్కింగ్ నిర్వహణను సమర్థవంతంగా చేపట్టి, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పరిశీలనలో అడిషనల్ ఎస్పీ రాజేష్ మీనా, జిల్లా లోని డీఎస్పీ అధికారులు శ్రీనివాస్,జానయ్య, అంజయ్య,యాదయ్య, శ్రీనివాస్ లు కొడంగల్ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి,వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, ఇతర పోలీసు అధికారులు , ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ రహిత పట్టణమే మున్సిపాలి టీ లక్ష్యం..

* **నిషేధిత ప్లాస్టిక్ వాడితే భారీ జరిమానాలు..**



జనగామ, ప్రజాస్ఫూర్తి : ప్లాస్టిక్ రహిత పట్టణ నిర్మాణమే లక్ష్యంగా పట్టణ ము న్సిపా లిటీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో పట్టణంలోని హోటళ్లు, రెస్టారెంట్లు, కిరాణా దుకాణాల యజ మానులతో మున్సిపల్ చైర్‌పర్సన్, క మిషనర్ ఆధ్వర్యంలో అవగాహన స మావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా అధికారులు మాట్లాడుతూ,ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక్కసారి వాడి పా రేసే (సింగిల్ యూజ్) ప్లాస్టిక్ క్యారీ బ్యా గుల తయారీ, నిల్వ, అమ్మకం,పంపిణీ పై పూర్తిస్థాయి నిషేధం అమల్లో ఉందని తెలిపారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగులకు బ దులుగా గుడ్డ సంచులు, కాగితపు సం చులు లేదా బయోడిగ్రేడబుల్ సంచుల ను వినియోగించాలని వ్యాపారులకు సూచించారు. నిషేధిత ప్లాస్టిక్ వినియో గిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పా టు భారీ జరిమానాలు విధిస్తామని హె చ్ రించారు. త్వరలోనే ఆకస్మిక తనిఖీ లు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘిం చే వారిపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ ప్లాస్టిక్ రహిత పట్టణ నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తామని వ్యాపారులు హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్,కమిషనర్ రాజశేఖర్ రెడ్డి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, శానిట రీ ఇన్‌స్పెక్టర్ తోపాటు ఇతర మున్సిప ల్ అధికారులు పాల్గొన్నారు.

# ఇందన్‌పల్లి రేంజ్ లో అక్రమ టేకు రవాణా పట్టివేత

* **వ్యాన్, టేకు దూలాలు, ఫర్నిచర్ స్వాధీనం**

ప్రజాస్ఫూర్తి , జన్నారం : జన్నారం అటవీ డివిజన్ ఇందన్‌పల్లి రేంజ్ పరిధిలోని కలమడుగు చెక్‌పోస్ట్ వద్ద అటవీ శాఖ అధికారులు నిర్వహించిన తనిఖీలలో అక్రమ టేకు కలప రవాణా చేస్తున్న మినీ వ్యాన్ ను పట్టుకున్నామని ఇందనపల్లి ఎఫ్ఆర్ఓ జి. లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలోని దేవునిగూడ గ్రామానికి చెందిన టీఎస్ 19 టీ 3770 నంబర్ గల అశోక్ లేలాండ్ మినీ వ్యాన్ లో ఎలాంటి చెల్లుబాటు అయ్యే ట్రాన్సిట్ పర్మిట్ లేకుండా టేకు దూలాలు, టేకు ఫర్నిచర్ మరియు టేకు దుంగలను తరలిస్తుండగా అధికారులు స్వాధీనం చేసుకున్నారు.వాహనంతో పాటు అక్రమంగా రవాణా చేస్తున్న టేకు అటవీ ఉత్పత్తులను స్వాధీనం చేసుకొని సంబంధిత అటవీ చట్టాల ప్రకారం కేసు నమోదు చేశారు.ఈ సందర్భంగా ఇందన్‌పల్లి రేంజ్ అధికారి జి. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ,అటవీ సంపదను అక్రమంగా నరికివేయడం, రవాణా చేయడంపై అటవీ శాఖ నిరంతరం నిఘా ఉంచిందని తెలిపారు. అటవీ నేరాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా అటవీ సంపద పరిరక్షణలో భాగస్వాములు కావాలని, అక్రమ కలప రవాణా గురించి సమాచారం ఉంటే వెంటనే అటవీ శాఖకు తెలియజేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ మధుకర్,ఎఫ్బీఓ లు పోచయ్య,తన్వీర్ మరియు బేస్ క్యాంప్ వాచర్లు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు పని గుత్తకు తీసుకొని కాంట్రాక్టర్ మోసం



ప్రజాస్ఫూర్తి ,జన్నారం : జన్నారం మండలం పోనకల్ గ్రామపంచాయతీ పరిధిలోని వరద బాధితుల కాలనీకి చెందిన గూడు లేని నిరుపేద మర్శకోలా గీత శ్రావణ్ కుమార్ దంపతులకు కాంగ్రెస్ ప్రభుత్వం "ఇందిరమ్మ ఇల్లు" పథకం ద్వారా ఇల్లు మంజూరు చేశారు. అయితే ఇల్లు కట్టుకోలేని పరిస్థితిలో ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ కాంట్రాక్టర్ మహ్మద్ యూసుఫ్ కు ఇల్లు గుత్తకు ఇచ్చారు.స్లాబ్ వరకు పని నాణ్యత లేకుండా చేసి బిల్లులు లేపుకున్న ఆయన, గత నాలుగు నెలలుగా ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు."ఇల్లు అర్ధాంతరంగా ఆగిపోయి మేము ఎటు కాకుండా అయ్యాము" అంటూ లబ్ధిదారులు కన్నీరు పెట్టుకున్నారు.ఈ కాంట్రాక్టర్ పై వెంటనే అధికారులు చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ విషయంపై స్థానిక ఎంపీడీవో ఉమర్ షరీఫ్ ను వివరణ కోరగా బాధితులతో మాట్లాడి తగిన న్యాయం చేస్తానని చెప్పారు.



# మధుర పరిమళాల మనోహరం!

**ప్రకృతి ఒడిలో వికసించే పూలలో కొన్ని కేవలం అందాన్ని ఇస్తే, మరికొన్ని మధురమైన సుగంధాన్ని వెదజల్లుతాయి. కానీ, ఈ రెండింటినీ రంగరించుకున్న అద్భుతమైన తీగ మొక్క 'హనీసకల్'.**





హనీసకల్ అనగానే మనకు గుర్తొచ్చేది దాని విలక్షణమైన పూల ఆకారం. గొట్టం ఆకారంలో ఉండే ఈ పూలు గుత్తులు గుత్తులుగా పూస్తాయి. ఈ పూల అడుగు భాగంలో ఉండే మకరందం అత్యంత తీపిగా ఉండటం వల్ల దీనికి 'హనీసకల్' అనే పేరు వచ్చింది. పూలు... తెలుపు, పసుపు, ఎరుపు, పింక్ నారింజ రంగులలో విచ్చుకుంటాయి. ఈ పూల తీపి వాసన సీతాకోకచిలుకలను, తేనెటీగలను హమ్మింగ్ బర్డ్స్‌ను ఆకర్షిస్తుంది. సువాసనలు వెదజల్లే ఈ పూలలో కొన్ని రకాలు... సాయంత్రం వేళల్లో మరింత గాఢమైన సుగంధాన్ని విడుదల చేస్తాయి. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 180 రకాల జాతుల్ని కలిగిన హనీసకల్ మొక్కది వేల ఏళ్ల చరిత్ర. ప్రాచీన చైనా వైద్య శాస్త్రంలో దీన్ని కీలకంగా వాడతారు. ముఖ్యంగా శరీరాన్ని చల్లబరచడానికీ, విష పదార్థాలను బయటకు పంపడానికీ ఉపయోగిస్తారట. బ్రిటన్‌లో విక్టోరియన్ కాలంలో ఈ పూలను ప్రేమకు, విశ్వాసానికి చిహ్నంగా, పెళ్లిలో వధువు ఈ పూలను పెట్టుకోవడం శుభసూచకంగానూ భావించేవారట. అందుకేనేమో... షేక్స్‌పియర్ వంటి ప్రముఖ కవుల రచనల్లో ఈ పూల ప్రస్తావన ఎక్కువగా కనిపిస్తుంది.

**తేమ అవసరమే కానీ...**

ఈ మొక్కకు రోజుకు కనీసం 6 నుంచి 8 గంటల పాటు ఎండ అవసరం. ఎండ తక్కువైతే పూలు తక్కువగా పూస్తాయి. నీరు నిల్వ ఉండని సారవంతమైన నేలలు దీనికి అనుకూలం. ఇవి తీగ జాతి మొక్కలు కాబట్టి, పాకడానికి గోడలు, ఫెన్సింగ్ లేదా ట్రెల్లీస్ వంటి ఆధారాల్ని కల్పించాలి. మొక్క నాటిన కొత్తలో క్రమం తప్పకుండా నీరు పెట్టాలి. ఎదిగిన తర్వాత నేల పైపొర ఆరిపోయినప్పుడు మాత్రమే నీరు పోయాలి. వేర్ల దగ్గర తేమ ఉండాలి కానీ నీరు నిలిచిపోకూడదు. శీతకాలం చివరలో లేదా వసంతకాలం మొదట్లో మొక్కను కత్తిరించాలి. ఎండిపోయిన కొమ్మలను తొలగించడం వల్ల కొత్త చిగుళ్లు వచ్చి పూలు ఎక్కువగా పూస్తాయి. ఏడాదికి రెండుసార్లు కంపోస్ట్ లేదా స్లోరిలీజింగ్ ఫెర్టిలైజర్లను అందించాలి. ఈ మొక్కకు పిండి నల్లి, తెల్లదోమ, బూజు తెగులు వంటివి వచ్చే అవకాశం ఉంది. వీటిని దూరం చేయడానికి ఫంగిసైడ్‌తో పాటు వేపనూనె పిచికారీ చేయవచ్చు. దానికంటే ముందుగా వ్యాధిసోకిన కొమ్మలు, ఆకులను కత్తిరించి దూరంగా పారేయడం మంచిది. ఈ జాగ్రత్తలతో మొక్క ఆరోగ్యంగా నిండుగా పూస్తుంది.





# చెమట పడితే మంచిదేనట!


**వేసవిలో వేడికి తట్టుకోలేక శరీరం చెమటలు పట్టడం సహజమే! అయితే ఇలా చెమటలు రావడం వల్ల చిరాగ్గా, అసౌకర్యంగా అనిపిస్తుంటుంది. దీంతో ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లను ఆశ్రయిస్తుంటాం. నిజానికి శరీరం నుంచి చెమట బయటికి రాకుండా ఎప్పుడూ ఇలా చల్లటి వాతావరణంలో గడపడం కంటే.. కాస్త చెమట పట్టనివ్వడమే ఆరోగ్యకరం అంటున్నారు నిపుణులు. మరి, అదెలాగో తెలుసుకుందాం రండి..**

వడదెబ్బ తగలకుండా..!

ఎండాకాలంలో కాసేపు బయట గడిపినా, అధిక ఉష్ణోగ్రతల ప్రభావం వల్ల వడదెబ్బ తగులుతుంటుంది. అయితే చెమటలు పట్టడం వల్ల వడదెబ్బ నుంచి కొంతవరకు రక్షణ పొందచ్చంటున్నారు నిపుణులు. అదెలాగంటే.. చెమట మన శరీరానికి సహజసిద్ధమైన కూలింగ్ ఏజెంట్‌లా పనిచేస్తుంది. ఎండ వేడి శరీరంలోకి వెళ్లకుండా చెమట అడ్డుపడుతుంది. తద్వారా శరీరంలో ఉష్ణోగ్రతలు పెరగకుండా జాగ్రత్తపడచ్చు. ఇక ఈ కాలంలో వడదెబ్బ నుంచి రక్షణ పొందాలంటే.. ద్రవాహారం ఎక్కువగా తీసుకోవడం, శరీరానికి చలువ చేసే పదార్థాల్ని తీసుకోవడమూ ముఖ్యమే అంటున్నారు నిపుణులు.

**రోగనిరోధక శక్తికి!**

స్వేద గ్రంథులు విడుదల చేసే చెమట రోగనిరోధక శక్తినీ పెంచుతుందని ఓ అధ్యయనంలో తేలింది. ఇందుకు స్వేద గ్రంథుల్లో ఉండే యాంటీమైక్రోబియల్ పెప్టైడ్లే కారణమట! ఇవి వ్యాధులకు కారణమయ్యే క్రిములతో పోరాడి.. సహజ రక్షణ కల్పిస్తాయి అంటున్నారు నిపుణులు.



**ఇవి కూడా!**

- వ్యాయామం చేసే క్రమంలో చెమట పడుతుంది. తద్వారా శరీరం చల్లబడడంతో పాటు ఎండార్ఫిన్లూ విడుదలవుతాయి. ఫలితంగా శారీరక నొప్పులు, ఒత్తిళ్లు తగ్గి ప్రశాంతంగా ఉండచ్చు అంటున్నారు నిపుణులు.
- శరీరం చెమట పట్టినప్పుడు చర్మ గ్రంథులు తెరుచుకుంటాయి. తద్వారా చర్మ రంధ్రాల్లో గాలి బాగా ఆడుతుంది. అలాగే శరీరంలోని మలినాలూ చెమట రూపంలో బయటికి వచ్చేస్తాయి. వీటివల్ల చర్మం ఎప్పటికప్పుడు శుభ్రపడుతుందట.

గమనిక : అయితే ఇలా చెమట పట్టడం మంచిదే అయినా.. ఎక్కువసేపు ఇలాగే ఉండడం వల్ల చర్మ ఆరోగ్యం దెబ్బతింటుంది. వాతావరణంలోని దుమ్ముధూళి చెమటతో కలిసి చర్మ రంధ్రాల్లోకి చేరడం వల్ల మొటిమలు, మచ్చలు ఏర్పడతాయి. కాబట్టి చెమట పట్టిన వెంటనే స్నానం చేయడం మంచిదంటున్నారు నిపుణులు.



# ఇలా... ప్రకృతికి చేరువగా!

**అపార్ట్‌మెంట్లలో ప్రతి చదరపు అడుగూ విలువైనదే. ఆయా గదుల్ని వినియోగం పరంగా ప్రత్యేకంగా మార్పులు చేసుకోలేం కానీ, బాల్కనీ అందుకు మినహాయింపు. అందుకే దీన్ని ఎలా తీర్చిదిద్దుతున్నామనేది ముఖ్యం. ప్రకృతికీ, పచ్చదనానికీ చేరువయ్యేందుకు ఇదో దగ్గర మార్గం. అందుకోసం ఏం చేయాలంటే...**

కాసేపు ఎండ పట్టడం, తీరిగ్గా కూర్చొని కప్పు కాఫీ తాగడం, ధ్యానం చేసుకోవడం... అన్నింటికీ ఒకటే చోటు... బాల్కనీ. చూశారా ఇది ఎంత ముఖ్యమైందో! అందుకే దీన్ని చిన్నపాటి పార్కుగా మార్చేయాలి. అప్పుడే ప్రకృతిలోకి వెళ్లాలనుకున్నప్పుడల్లా అక్కడ కాసేపు కూర్చొని సేదతీరొచ్చు.

- నిలువుగా పెరిగే మొక్కలకు ప్రాధాన్యం ఇవ్వండి. అవి పాకేందుకు వీలుగా ఏర్పాట్లుచేయాలి. ఇవి గాలిని శుద్ధి చేస్తాయి. అలాగే ఎండ నుంచి ఉపశమనం కలిగిస్తాయి.
- తరచూ మార్చాల్సిన పనిలేకుండా ఎండలూ, వర్షాలకు తట్టుకునే మెటీరియల్‌ని అక్కడ ఉపయోగించాలి. అందుకు గట్టి కుండీలు, మెటల్‌తో చేసిన వస్తువులు ఎంచుకోవడం మేలు.
- ఇన్విజబుల్ నెట్టింగ్ బార్‌ని ఉపయోగించి పావురాలను దూరం పెట్టండి. అక్కడ కూర్చునేందుకు ప్రత్యేకంగా చిన్న సైజు కుర్చీల్ని వినియోగించండి.
- చీకటిపడ్డాక పెద్ద లైట్లు కాకుండా చిన్న సోలార్ లాంతర్లు వాడండి. వాటిని మొక్కల మధ్యన ఉంచితే ఇంకా మంచిది.

# వేసవి తాపాన్ని తగ్గించే జల్ జీరా!

ఎండా కాలం వచ్చిందంటే చాలు దాహంతో అల్లాడిపోతుంటాం. ఈ సమయంలో కృత్రిమమైన కూల్ డ్రింక్స్, సోడాలను తాగే బదులు ఓ గ్లాస్ జల్ జీరా తాగి చూడండి. ఇది దాహం తీర్చడమే కాదు... మరెన్నో ఆరోగ్య ప్రయోజనాలనూ అందిస్తుంది. ముఖ్యంగా ఇందులోని జీలకర్ర జీర్ణ రసాల ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. గ్యాస్, ఎసిడిటీ, కడుపు ఉబ్బరం వంటి సమస్యలను తగ్గిస్తుంది. దీన్ని క్రమం తప్పకుండా తీసుకుంటే శరీరానికి అవసరమైన ఇనుమూ అందుతుంది. పీరియడ్స్ సమయంలో వచ్చే పొత్తికడుపు నొప్పి, తిమ్మిర్ల నుంచి ఈ పానీయం ఉపశమనం కలిగిస్తుంది. ఇక, ఇందులోని నల్ల ఉప్పు... శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్లను అందిస్తుంది. అందుకే, ఎండలో తిరిగి ఇంటికి రాగానే ఒక గ్లాసు జల్ జీరా తాగి చూడండి. ఆ అలసట తక్షణమే మాయమవుతుంది. వేయించిన జీలకర్ర, కొద్దిగా అల్లం ముక్క, పుదీనా ఆకులు, పచ్చిమిర్చి (అవసరమైతే) కలిపి మెత్తగా రుబ్బాలి. ఈ మిశ్రమాన్ని చల్లని నీటిలో కలిపి, తగినంత నల్ల ఉప్పు, ఆమ్‌చూర్ పొడి, నిమ్మరసం కలపాలి. చివరగా కొద్దిగా బూందీ చల్లుకుంటే సరి. రుచికరమైన జల్ జీరా తయారైనట్లే. సహజ సిద్ధమైన ఈ పానీయం పెయిన్‌కిల్లర్‌లానూ పనిచేస్తుంది. జీవక్రియను మెరుగుపరుస్తుంది. ముఖ్యంగా తక్కువ కెలొరీలు ఉండి, ఆకలిని నియంత్రించడంలో సహాయపడటం వల్ల బరువు తగ్గాలనుకునే మహిళలకు మంచి ఎంపిక.



MOVIE TIME



# బాలయ్య మూవీలో విలన్‌గా..

ఇప్పటివరకు హీరోయిన్‌గా అలరించిన అచ్చ తెలుగు బ్యూటీ ఐశ్వర్య రాజేష్ కొత్త అవతారమెత్తనుంది. ప్రేక్షకులను భయపెట్టేందుకు రెడీ అవుతోంది. బాలకృష్ణ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతోన్న సినిమాలో విలన్ పాత్రలో కనిపించబోతున్నట్లు వార్తలొస్తున్నాయి. హీరోగా ధీటుగా సాగే పాత్ర కోసం ఐశ్వర్యను కొరటాల అప్రోచ్ అయ్యారట. పాత్రలోని వేరియేషన్స్, స్కోప్ నచ్చడంతో ఆమె అంగీకరించినట్లు సమాచారం. తమన్ మ్యూజిక్ అందిస్తుండగా కార్పెంటర్ అనే వెరైటీ టైటిల్‌ను పరిశీలిస్తోన్నట్లు వార్తలొస్తున్నాయి. ఇటీవలే పూజా కార్యక్రమాలను నిర్వహించగా త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ మొదలు కాబోతున్నట్లు సమాచారం. కాగా ఐశ్వర్య రాజేష్ హీరోయిన్‌గా నటించిన ఓ సుకుమారి మూవీ ఇటీవల థియేటర్లలో రిలీజైంది. దీంతో పాటు ఇసకపట్నం వెబ్‌సిరీస్ కూడా విడుదలైంది.



# కియారా ఫిక్స్!

ఎన్టీఆర్, త్రివిక్రమ్ గాడ్ ఆఫ్ వార్‌కు హీరోయిన్ దొరికిందా? అంటే ఔననే అంటున్నాయి టాలీవుడ్ వర్గాలు. ఈ మైథాలజీ మూవీలో కియారా అద్వానీ హీరోయిన్‌గా ఫిక్సైనట్లు సమాచారం. మలయాళ బ్యూటీ మంజిమా మోహన్ ఓ కీలక పాత్రలో కనిపించబోతున్నట్లు చెబుతున్నారు. దాదాపు 500 కోట్ల బడ్జెట్‌తో ఈ మూవీ తెరకెక్కుతోంది. యుద్ధ దేవుడిగా పురాణాలు పేర్కొన్న కుమారస్వామి కథతో ఈ మూవీ రూపొందుతోంది. అనిరుధ్ మ్యూజిక్ అందిస్తుండగా హారిక హాసిని క్రియేషన్స్ పతాకంపై రాధాకృష్ణ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. కాగా తెలుగులో ఇప్పటివరకు మహేష్‌బాబుతో, రామ్‌చరణ్‌తో సినిమాలు చేసింది ఈ బాలీవుడ్ బ్యూటీ.

# ఫ్లాపులున్నా ఛాన్స్‌లు కొట్టేస్తోంది

ఫ్లాపులతో సంబంధం లేకుండా ఛాన్స్‌లో కొట్టేస్తోంది టాలీవుడ్ బ్యూటీ డింపుల్ హయతి. రవితేజతో ముచ్చటగా మూడోసారి జోడీ కట్టబోతుంది. రవితేజ హీరోగా వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో ఫన్ యాక్షన్ మూవీ రాబోతోంది. ఇందులో హీరోయిన్‌గా డింపుల్ కన్ఫామ్ అయినట్లు వార్తలొస్తున్నాయి. కథానాయికగా ఈ ముద్దుగుమ్మ పేరును దర్శకనిర్మాతలకు రవితేజనే సూచించినట్లు సమాచారం. భర్త మహాశయులకు విజ్ఞప్తి కంటే ముందు వీరిద్దరు కలిసి ఖిలాడీలో నటించారు. వచ్చే ఏడాది ఆరంభంలో రవితేజ, వివేక్ ఆత్రేయ మూవీ సెట్స్‌పైకి రానున్నట్లు సమాచారం. తెలుగు, తమిళం, కన్నడంతో పాటు హిందీ భాషల్లో కలిపి 11 సినిమాలు చేసింది. అయినా ఒక్క హిట్టు కూడా దక్కలేదు. అయినప్పటికీ ఈ అమ్మడు మాత్రం చక్కటి ఆఫర్లను సొంతం చేసుకుంటోంది.



# దుమ్ములేపుతున్న రాసా గుమ్మాడి

టాలీవుడ్‌లో ప్రస్తుతం ఫోక్ సాంగ్స్ ట్రెండ్ నడుస్తోంది. ఈ ట్రెండ్‌లోకి మెగా హీరో వరుణ్ తేజ్ కూడా ఎంటరయ్యాడు. అతడు హీరోగా నటిస్తున్న కొరియన్ కనకరాజు నుంచి రాసా గుమ్మాడి అనే సాంగ్‌ను మేకర్స్ సోమవారం రిలీజ్ చేశారు. ఇందులో వరుణ్‌తో కలిసి దక్షా నగార్కర్ వేసిన స్టెప్పులు ఈ పాటకు హైప్ తెచ్చాయి. మరోవైపు లిరిక్స్ ఆద్యాంతం ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం ఈ సాంగ్ యూట్యూబ్‌తో పాటు ఇతర మ్యూజిక్ ప్లాట్‌ఫామ్స్‌లో ట్రెండింగ్‌లో ఉంది. ఈ పాటను నల్గొండ గద్దర్ ఆలపించగా కాసర్ల శ్యామ్ లిరిక్స్ అందించారు. తమన్ మ్యూజిక్ అందించాడు.



# డైరెక్టర్‌గా సింగ్ గీతం హీరోయిన్

సింగ్ గీతం హీరోయిన్ షాలిని కొండెపూడి మెగాఫోన్ పట్టబోతుంది. ఫన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మూవీ ద్వారా డైరెక్టర్ అవతారమెత్తి టాలీవుడ్‌కు పరిచయం కాబోతుంది. షాలిని డెబ్యూ మూవీని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ నిర్మించబోతున్నట్లు చెబుతున్నారు. స్టార్ హీరో తనయుడు లీడ్ రోల్‌లో నటిస్తోన్న ఈ మూవీలో షాలిని ఓ కీలక పాత్రలో నటించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. త్వరలోనే ఈ సినిమా సెట్స్‌పైకి రానున్నట్లు సమాచారం. కాగా చూసీ చూడంగానే మూవీతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది ఈ చిన్నది. ఆ తర్వాత శుభం, జయమ్ము నిశ్చయమ్మురా, లైఫ్ స్టోరీస్‌తో పాటు మరికొన్ని చిన్న సినిమాల్లో హీరోయిన్‌గా, క్యారెక్టర్ యాక్టర్‌గా కనిపించింది. సినిమాల్లోకి ఎంట్రీ ఇవ్వక ముందే అల్లుడు గారు వెబ్‌సిరీస్‌తో ఫేమస్ అయ్యింది.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.